**విలేకరులు కావలెను**

మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను
Cell: 9247819181
8309605189

# మన వార్త
ప్రజాగళానికి అక్షర రూపం
MANA VAARTHA

EPAPER.MANAVAARTHA.NET
MANA VAARTHA

Telangana | సంపుటి: 1, సంచిక: 169 | volume: 1, Issue: 169 | శనివారం 17 జనవరి 2026 పేజీలు : 8 వెల : 3.00

## ఆదిలాబాద్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక
# ప్రకటించిన ముఖ్యమంత్రి



- బాసర ఐఐఐటీలో విశ్వవిద్యాలయం, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణం...
- నిర్మల్‌లో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్, భారీ పారిశ్రామిక వాడ...
- "పాలమూరుతో సమానంగా ఆదిలాబాద్ అభివృద్ధి"...

**నిర్మల్, జనవరి 16 :** తెలంగాణలో అత్యంత వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విస్తృత ప్రణాళికను ప్రకటించారు. బాసరలోని ఐఐఐటీలో విశ్వవిద్యాలయం ఏర్పాటు, నిర్మల్‌లో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు, తాగు మరియు సాగునీటి అవసరాల కోసం తుమ్మిడిహెట్టి వద్ద చేవెళ్ల ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణం, జిల్లాలో అతిపెద్ద పారిశ్రామిక వాడ ఏర్పాటు వంటి కీలక నిర్ణయాలను వెల్లడించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రూ. 386.46 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్మల్ పట్టణంలో నిర్వహించిన "ప్రజా పాలన ప్రగతి బాట" బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. ఆదిలాబాద్ జిల్లాకు రావాల్సినంత అభివృద్ధి, నీటి వనరులు గతంలో అందలేదని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిస్థితిని మార్చేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. పాలమూరు జిల్లాకు ఇచ్చిన ప్రాధాన్యతను అదే స్థాయిలో ఆదిలాబాద్ జిల్లాకు కూడా ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. చనాక కొరాట బ్యారేజీకి మాజీ మంత్రి చిలుకూరి రామచంద్రారెడ్డి పేరు, సదర్మట్ బ్యారేజీకి స్వతంత్ర సమరయోధుడు, మాజీ మంత్రి పి. నర్సారెడ్డి పేరు పెట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అంశంపై నీటి పారుదల శాఖ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పదేళ్లుగా చనాక కొరాట ప్రాజెక్టు పూర్తి కాలేదని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే పనులు పూర్తయ్యాయని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. నిర్మల్‌లో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయడం ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. సరస్వతీ ఆలయం ఉన్న బాసర ఐఐఐటీలోనే విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. వర్సిటీ ఎక్కడ అన్న చర్చలతో కాలం వృథా చేయకుండా బాసరలోనే ఏర్పాటు చేస్తున్నామని, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఆదిలాబాద్ జిల్లాలో అతిపెద్ద పారిశ్రామిక వాడ అభివృద్ధి చేసి దేశంలోని ప్రధాన పరిశ్రమలు ఇక్కడ స్థాపించేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి తెలిపారు. ఇందుకోసం పది వేల ఎకరాల భూమి సేకరణ అవసరమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు సహజమని, కానీ ఇప్పుడు ప్రజల కోసం కలిసిమెలిసి పనిచేయాల్సిన సమయమని అన్నారు. ఎర్ర బస్సు కూడా రాని పరిస్థితి నుంచి ఎయిర్ బస్ వచ్చే స్థాయికి ఆదిలాబాద్‌ను తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. నాగోబా జాతర అభివృద్ధికి రూ. 22 కోట్లు మంజూరు చేస్తామని, అలాగే మేడారం సమ్మక్క సారలమ్మ మందిరాన్ని కుంభమేళా స్థాయిలో అభివృద్ధి చేయడానికి సుమారు రూ. 300 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఆదిలాబాద్ ఎంపీ గోడం నాగేష్తో పాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. "మేము పాలకులం కాదు, సేవకులం" అని ముఖ్యమంత్రి స్పష్టం చేస్తూ, ఆదిలాబాద్ జిల్లాను తెలంగాణ అభివృద్ధి పటంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

## జైపూర్‌కు చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



- ఘన స్వాగతం పలికిన రాజస్థాన్ గవర్నర్, ముఖ్యమంత్రి...
- ఉప ముఖ్యమంత్రుల హాజరు...
- అధికారిక పర్యటనకు ఆరంభం...

**జైపూర్, జనవరి 16:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజస్థాన్ రాజధాని జైపూర్‌కు చేరుకున్నారు. ఆమె రాక సందర్భంగా రాజస్థాన్ గవర్నర్ హరిభౌ కిసన్‌రావు బాగ్డే, ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ ఘన స్వాగతం పలికారు. రాష్ట్రపతి పర్యటనకు ఇది అధికారిక ఆరంభంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో రాజస్థాన్ ఉప ముఖ్యమంత్రులు దియా కుమారి, ప్రేమ్ చంద్ర బైర్వా పాల్గొని రాష్ట్రపతికి స్వాగతం తెలిపారు. ఉన్నతాధికారులు కూడా విమానాశ్రయానికి చేరుకుని గౌరవాభివందనం చేశారు. రాష్ట్రపతి జైపూర్ పర్యటన సందర్భంగా రాజస్థాన్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాసంబంధిత అంశాలపై అధికారులతో సమీక్షలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం. రాష్ట్రాభివృద్ధి, సామాజిక సంక్షేమ కార్యక్రమాలపై చర్చలు జరగనున్నాయని అధికారులు తెలిపారు. రాజ్యాంగ పరమైన బాధ్యతలు, ప్రజాసేవలో రాష్ట్రపతి పాత్రకు ఈ పర్యటన మరింత ప్రాధాన్యతను సంతరించుకుందని పలువురు పేర్కొన్నారు. రాష్ట్రపతి పర్యటన విజయవంతం కావాలని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించింది.

## కరీంనగర్‌లో బీజేపీలో భారీ చేరికలు



**కరీంనగర్, జనవరి 14 :** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంతో స్మార్ట్ సిటీ నిధులు, అమృత్ నిధులు తదితర కేంద్ర పథకాల ద్వారా కరీంనగర్ కార్పొరేషన్‌లో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై పలువురు బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. కరీంనగర్ 51వ డివిజన్‌కు చెందిన తాజా మాజీ కార్పొరేటర్ బండారు వేణు, బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ సాధినేని మునీందర్, కల్వకుంట్ల ప్రమోద్ రావు, గాజె శివరాం సహా సుమారు 50 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ, పార్టీలో చేరిన వారందరికీ మనస్ఫూర్తిగా స్వాగతం తెలిపారు. కరీంనగర్‌లో జరుగుతున్న అభివృద్ధే బీజేపీ విధానాలకు ప్రజల విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో కరీంనగర్ నగరాభివృద్ధి వేగంగా సాగుతోందని పేర్కొన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ కార్పొరేషన్‌లో బీజేపీ అభ్యర్థులందరినీ గెలిపించి మేయర్ పీఠాన్ని బీజేపీకి ఇవ్వాలని కరీంనగర్ ప్రజలకు బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు. ప్రజల మద్దతుతో కరీంనగర్‌ను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పారదర్శక పాలన, నిరంతర అభివృద్ధే బీజేపీ లక్ష్యమని బండి సంజయ్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో కరీంనగర్‌ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు బీజేపీ కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.

## హతిఘాట్‌లో చనాక కొరాటా బ్యారేజ్
# పంప్‌హౌస్ ప్రారంభం



- లోయర్ పెనుగంగ ప్రధాన కాలువకు నీటి విడుదల...
- సాగునీటికి కొత్త ఊపిరి...
- రైతుల జీవితాల్లో మార్పుకు బాట...
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి...

**ఆదిలాబాద్, జనవరి 16 :** ఆదిలాబాద్ జిల్లా భోరాజ్ మండలం హతిఘాట్ గ్రామంలో చనాక కొరాటా బ్యారేజ్ పంప్‌హౌస్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా లోయర్ పెనుగంగ ప్రాజెక్టు ప్రధాన కాలువకు నీటిని విడుదల చేసి హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమం ఉత్తర తెలంగాణ ప్రాంత సాగునీటి అవసరాలకు కీలక మైలురాయిగా నిలిచింది. బ్యారేజ్ ద్వారా పెనుగంగ నది జలాలను సమర్థవంతంగా వినియోగించుకొని సాగునీటి విస్తీర్ణాన్ని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే వేల ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందుతుందని, తద్వారా రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, అటవీ మరియు పర్యావరణ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గోడం నాగేష్, ఖానాపూర్ శాసనసభ్యుడు పాయల్ శంకర్తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. లోయర్ పెనుగంగ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతం సాగునీటితో పాటు త్రాగునీటి సమస్యల నుంచి కూడా క్రమంగా విముక్తి పొందుతుందని అధికారులు తెలిపారు. అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేసి రైతులకు పూర్తి స్థాయిలో ప్రయోజనం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు
# సర్వం సిద్ధం



ములుగు, జనవరి 14 : మేడారంలో జరగనున్న సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రాష్ట్ర మంత్రి సీతక్క తెలిపారు. జాతర ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయని, తల్లీ దేవతల దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టిందని ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఈసారి మహాజాతరకు సుమారు మూడు కోట్ల మందికి పైగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని రవాణా, భద్రత, వైద్య సేవలు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా వంటి అన్ని అంశాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. భక్తులకు మార్గనిర్దేశం చేయడం, రద్దీ నియంత్రణ, అత్యవసర సహాయం అందించడంలో వాలంటీర్లు కీలక పాత్ర పోషించనున్నారని వివరించారు. గిరిజన సంప్రదాయాలు, ఆచారాలకు ప్రతీకగా నిలిచిన సమ్మక్క-సారలమ్మ మహాజాతరను భక్తి శ్రద్ధలతో, క్రమబద్ధంగా నిర్వహించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

# శనిగరం చెరువులో రొయ్యపిల్లల విడుదల

- మత్స్యకారుల ఆదాయాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం...
- 100 శాతం రాయితీతో స్టేట్ సెక్టార్ పథకం అమలు...
- మంత్రి పొన్నం ప్రభాకర్...



**సిద్దిపేట, జనవరి 14 :** మత్స్య అభివృద్ధి మరియు స్టేట్ సెక్టార్ పథకం కింద 100 శాతం రాయితీపై శనిగరం చెరువులో రొయ్యపిల్లలను విడుదల చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మత్స్యకారుల ఆదాయం పెంపొందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, చెరువులు, జలాశయాలను సద్వినియోగం చేసుకొని మత్స్య ఉత్పత్తిని పెంచడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. రొయ్యల పెంపకం ద్వారా మత్స్యకారులకు తక్కువ సమయంలో మంచి ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మలా జయరాజ్, శనిగరం సర్పంచ్ లింగంపల్లి లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు. మత్స్య సొసైటీ నాయకులు, సంబంధిత శాఖ అధికారులు, స్థానిక ముఖ్య నేతలు కూడా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి పథకాల ద్వారా చెరువుల అభివృద్ధి, మత్స్య సంపద పెంపుదల, ఉపాధి అవకాశాల సృష్టికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# జనసంద్రంగా మారిన మేడారం జాతర



**-సంక్రాంతి అనంతరం భారీగా తరలివచ్చిన భక్తులు...**
**-జంపన్న వాగులో పుణ్యస్నానాలు, అమ్మవార్లకు మొక్కుల చెల్లింపు...**
**-పచ్చని ప్రకృతిలో కుటుంబ సమేతంగా జాతర ఆనందం...**

**ములుగు జనవరి 16 మనవార్త** సంక్రాంతి పండుగ ముగియడంతో మేడారం మహాజాతరకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా మేడారం జాతర భక్తుల కోలాహలంతో కిటకిటలాడింది. లక్షలాది మంది భక్తులు మేడారం చేరుకుని ముందుగా జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి,అనంతరం అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పించేందుకు బంగారు బుట్టలను తలపై పెట్టుకొని గద్దల వద్దకు చేరుకున్నారు. తమ కోరికలను తీర్చే కొంగు బంగారంగా ప్రసిద్ధిగాంచిన శ్రీ సమ్మక్క□సారలమ్మ వనదేవతలకు భక్తులు వడి బియ్యం, బంగారం, చీర, సారె, పసుపు□కుంకుమతో పాటు బంగారాన్ని నైవేద్యంగా సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. అమ్మవార్ల దయతో తమ కుటుంబాలు సుఖశాంతులతో, పిల్లా పాపలు పాడిపంటలతో ఎల్లప్పుడూ ఆనందంగా ఉండాలని భక్తులు మనస్ఫూర్తిగా ప్రార్థించారు. మొక్కులు చెల్లించిన అనంతరం భక్తులు కుటుంబ సమేతంగా కంక వనాల (వెదురు అడవులు) మధ్య ఉన్న పచ్చని ప్రకృతిలో వంటావార్పు చేసుకుని, పిల్లలతో కలిసి సంతోషంగా సమయం గడిపారు. జాతర ఆనందాన్ని మనసారా అనుభవించిన భక్తులు, అమ్మవార్ల కృపతో తిరిగి తమ ఇళ్లకు ప్రయాణమవుతూ మేడారం మహాజాతరను మరపురాని అనుభూతిగా మలుచుకున్నారు. సేవ.



## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సోమారంపేట విద్యార్థిని నిత్య ఎంపిక

**-విద్యార్థిని నిత్యకు ఘన సత్కారం క్రీడా కిట్ అందిస్తామని హామీ...**

**ఇల్లంతకుంట జనవరి 16 (మన వార్త ప్రతినిధి);**చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటుతూ సోమారంపేట గ్రామానికి చెందిన విద్యార్థిని నిత్య రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికై గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా గురువారం ఆమెను గ్రామానికి చెందిన పోరెడ్డి సుమంత్ రెడ్డి,కాచం సురేందర్ రెడ్డి, భాను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. నిత్యకు కబడ్డీకి సంబంధించిన అవసరమైన క్రీడా కిట్‌ను అందజేస్తామని వారు హామీ ఇచ్చారు. సోమారంపేట గ్రామానికి చెందిన మూడపెల్లి సంపత్ కుమార్తె నిత్య ప్రస్తుతం ఇల్లంతకుంట మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలో మోడల్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతోంది. ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పోరెడ్డి సుమంత్ రెడ్డి,కాచం సురేందర్ రెడ్డి, భాను మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. ప్రతిభ గల విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగడానికి,చదువుల్లోనూ క్రీడల్లోనూ మరింత ముందుకు వెళ్లేందుకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు.




## గృహ జ్యోతి పథకం పేదలకు ఆసరా



**శంకరపట్నం:జనవరి16(మనవార్త ప్రతినిధి)** రాష్ట్ర ప్రభుత్వం గృహ జ్యోతి పథకం కింద పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో విద్యుత్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు లైన్మెన్ శ్రీనివాస్ లబ్ధిదారులకు గృహజ్యోతి పథకం ప్రొసీడింగ్స్ పత్రాలు అందజేశారు. ఎక్కడైనా అర్హులు ఉండి గృహజ్యోతి పథకం వినియోగానికి నోచుకోకపోతే మండల పరిషత్తు కార్యాలయంలో ప్రజాపాలన అధికారాలకు దరఖాస్తు చేసుకుంటే సమస్య పరిష్కరిస్తారని తెలిపారు. ఈ పథకం పేదలకు ఆసరాగా నిలుస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్పర్ నారాయణ ఉన్నారు.

## 18 న సిపిఐ శత వసంతాల ఉత్సవ ముగింపు సభకు తరలిరండి

**మధిర జనవరి16( మన వార్త ):**మధిర నియోజకవర్గం బోనకల్ మండలం భారతదేశంలో ఎర్రజెండా ఆవిర్భించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శత వసంతాల సిపిఐ ఉత్సవ ముగింపు సభను జనవరి 18న ఖమ్మంలోని ఎస్ఆర్ఎన్ బీజీఎన్ఆర్ ప్రాంగణంలో రాష్ట్ర పార్టీ ఘనంగా నిర్వహిస్తుందని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు తెలిపారు. ఈ ఉత్సవ ముగింపు సభ ను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు ఆకెన పవన్ తో కలిసి కలకోట, ముష్టికుంట్ల గ్రామాల్లో ముమ్మురంగా ప్రచారాన్ని శుక్రవారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలోనే కాక అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమానికి పెట్టిందే పేరుగా నిలించిందని పేర్కొన్నారు. అటువంటి ఖమ్మం జిల్లాలోని బోనకల్ మండలం విప్లవాల ఖిల్లాగా ప్రసిద్ధి చెందిందని, ఈ బోనకల్ మండలంలోని ప్రతి గ్రామంలో కమ్యూనిస్టు వీరులున్నారన్నారు. నాటి నైజాం రజకార్లను ఎదుర్కొని దొరలను, జమీందార్లను, జగీంర్ దార్లను తరిమికొట్టిన చరిత్ర ఈ మండలంలోని ప్రతీ గ్రామానికి ఉందనీ అన్నారు. సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన కామ్రేడ్ రావెళ్ల జానకిరామయ్య ఈ మండల వాసి కావడం గర్వించదగ్గ విషయమన్నారు. నాటి నుండి నేటి వరకు ప్రజల కోసం ప్రతి నిత్యం పోరాడుతూ, సమసమాజ స్థాపన కోసం పాటుపడుతున్న సిపిఐ శతవసంతాల ఉత్సవ ముగింపు సభను జనవరి 18న ఖమ్మంలోని ఎస్ ఆర్ ఎన్ బిజీఎన్ఆర్ ప్రాంగణంలో జరుగుతున్నట్లు తెలిపారు. ఈ సభకు 40 దేశాల ప్రతినిధులు, సిపిఐ జాతీయ కార్యదర్శి డి రాజా, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, అయ్యా రాష్ట్రాల కార్యదర్శులు, ప్రతినిధులు పాల్గొని ప్రసంగించనున్నారని తెలిపారు. ఈ ఉత్సవ ముగింపు సభకు ఊరు వాడ కదిలి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు మాతంగి శ్రీనివాసరావు, ఏఐకేఎస్ మండల అధ్యక్షులు కొంగర భాస్కరరావు, ముష్టికుంట్ల శాఖ కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, కలకోట శాఖ కార్యదర్శి యంగల పెద్ద రమేష్, బోయినపల్లి బసవయ్య, యూత్ నాయకులు యంగల గిరి, విద్యార్థి నాయకులు ఉజ్వల చరణ్, గోపి తదితరులు పాల్గొన్నారు.




## జననేతకు జన్మదిన శుభాకాంక్షలు



**పెబ్బేరు. జనవరి16(మన వార్త ప్రతినిధి)**జనం మెచ్చిన బడుగు బలహీన వర్గాల ఆశ జ్యోతి దొరల గడిలను బద్దలు కొట్టిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ బీసీ అధినేత పిలిస్తే పలికే ఒకే ఒక నాయకుడు టిఆర్పి పార్టీ వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కు తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు వనపర్తి జిల్లా యూత్ అధ్యక్షులు జి.రవికుమార్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఫిబ్రవరి మొదటి వారానికి వాయిదా వేయండి



**-టిఆర్టిఎఫ్ జిల్లా అధ్యక్షులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్...**

**రాజన్న సిరిసిల్ల, మన వార్త జనవరి 16** జనవరి 26 రిపబ్లిక్ డే ఉత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించే ఆటల పోటీలకు ఆటంకంగా ఉన్న జనవరి 23 24 తేదీలలో నిర్వహించే ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను వాయిదా వేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యాధికారి వినోద్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్, బోయన్నగారి నారాయణలు ప్రాతినిధ్యం చేశారు. దీనికి జిల్లా విద్యాధికారి గారు సానుకూలంగా స్పందించి ఇట్టి విషయాన్ని పై అధికారులకు సూచిస్తానన్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ... రిపబ్లిక్ డే సందర్భంగా విద్యార్థులందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొనే ఆటల పోటీలను దృష్టిలో ఉంచుకొని విద్యాశాఖ అధికారులు ప్రాథమిక ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఫిబ్రవరి మొదటి వారానికి వాయిదా వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బోయన్న గారి నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పోతుగంటి రమేష్, కొనరావుపేట మండల అధ్యక్షుడు గాజేంగివిష్ణు, తంగళ్ళపల్లి మండల అధ్యక్షుడు బూట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గోలి సంతోష్ మమత దంపతులకు సన్మానం సన్మానం

**-శ్రీ వాసవి రేణుక ఎల్లమ్మ ఆలయం వార్షికోత్సవ ఆహ్వానం పత్రిక అందజేత....**



**గజ్వేల్ జనవరి 16 మన వార్త ప్రతినిధి** శ్రీ గౌరీ రేణుక వాసవి బసవ లింగేశ్వరస్వామి వార్షికోత్సవ ఆహ్వానం పత్రిక సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో కొండ పోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ గోలి సంతోష్ మమత దంపతులకు అందజేసి ఘనంగా సన్మానించిన ఆధ్యాతిక వేత్త, వాసవి ఉపాసకులు, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర ధార్మిక పరిషత్ చైర్మన్ డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోలి సంతోష్ మమత దంపతుల సేవలు అభినందనీయం అని సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారని వారిని అభినందించడం జరిగిందని, శ్రీ గౌరీ రేణుకా బసవలింగేశ్వర స్వామి ఆలయ 29 వ వార్షికోత్సవం, మరియు అన్నపూర్ణ అన్నసత్రం 30వ వార్షికోత్సవం వేడుకలు, శివపార్వతుల కళ్యాణం, రేణుక జమదగ్ని కళ్యాణం, వాసవి మాతకు కుంకుమార్చన, రుద్ర యాగం, వివిధ ప్రత్యేక పూజలు 1-02-2026 తేదీ ఆదివారం రోజున నిర్వహించే కార్యక్రమానికి రావాల్సిందిగా ఆహ్వాన పత్రిక అందజేయడం జరిగిందని అన్నారు

## ప్రజా సేవే లక్ష్యం :ఉత్తునూరి సంపత్



**-20 వ వార్డ్ కౌన్సిలర్ బరిలో ఉత్తునూరి సంపత్!?**

**గజ్వేల్ జనవరి 16 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 20వ వార్డుకు చెందిన బి ఆర్ ఎస్ నాయకులు మనం ఫౌండేషన్ మాజీ చైర్మన్ ఉత్తునూరి సంపత్ గుప్తా ప్రజలకు సంక్రాంతి, భోగి కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు శుక్రవారం గజ్వేల్ లో ఉత్తునూరి సంపత్ గుప్తా మాట్లాడుతూ ప్రజా సేవే లక్ష్యం అని ప్రజలకు సేవ చేయడంలో తృప్తి ఉంటుందని, మానవసేవే మాధవసేవ అని వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ గతంలో మనం ఫౌండేషన్ ఏర్పాటు చేసి కరోనా క్లిష్ట సమయంలో నిరుపేదలకు అండగా నిలిచి మా సభ్యుల సహకారాలతో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, అలాగే ఇప్పుడు, సొంతంగా నిరుపేదలకు సహాయ సహకారాలు అందిస్తూ నా వంతు సేవ చేస్తున్నానని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో 20వ వార్డు నుంచి జనరల్ రిజర్వేషన్ వస్తె కౌన్సిలర్ గా పోటీ చేయడం జరుగుతుందని ప్రజలు ఆశీర్వదించాలని కౌన్సిలర్ గా గెలిచి వార్డు రూపురేఖలు మారుస్తానని స్వార్థం లేకుండా, ప్రజా సేవ చేయడానికి మీ ముందుకు వస్తున్నానని ధనార్జన లేకుండా సేవే పరమావధిగా మీ ముందుకు వస్తున్న నాకు 20వ వార్డు ప్రజలు ఆశీర్వదించాలన్నారు

## రాష్ట్రస్థాయి సంకల్ప యువ పురస్కార్ అవార్డుల పోస్టర్ ఆవిష్కరణ

**-వలస సుభాష్ చంద్రబోస్ యువజన అవార్డు గ్రహీత వ్యవస్థాపక అధ్యక్షులు, సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ....**

**ఎల్కతుర్తి జనవరి 16 మనవార్త ప్రతినిధి** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి జనవరి 23 పురస్కరించుకొని ఘనంగా నిర్వహిస్తున్నట్టు అందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా యువజన సంఘాలకు మహిళా సంఘాలకు రాష్ట్రస్థాయి సంకల్ప యువ పురస్కారం అవార్డుల ప్రధాన ఉత్సవ కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరణ చేసిన సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు యువజన అవార్డు గ్రహీత వలస సుభాష్ చంద్రబోస్ ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ హైదరాబాదులోని రవీంద్రభారతిలో రాష్ట్రస్థాయి సంకల్ప యువ పురస్కార్ అవార్డు కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు 30 సంవత్సరాల వయసుగల యువజన సంఘాలకు మహిళా సంఘాలకు ఈ& అవకాశం కల్పిస్తున్నట్టు ఆయన తెలిపారు యువజన మహిళ సంఘాల ద్వారా వారు చేసిన సామాజిక సేవ రంగాలలో ప్రతిభ కలిగిన వారికి రాష్ట్రస్థాయి సంకల్ప యువ పురస్కార్ అవార్డులు ప్రధానం చేస్తున్నట్టు వలస సుభాష్ చంద్రబోస్ తెలిపారు యువజన మహిళా సంఘాలు సామాజిక సేవా కార్యక్రమాల చురుకుగా పాల్గొన్న వారికి సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్రస్థాయి సంకల్ప యువ పురస్కార్ అవార్డు యువజన మహిళ సంఘాలు సామాజిక సేవ చేసిన వివిధ రంగాలలో నైపుణ్యం గల వారి కి మా సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా రాష్ట్రస్థాయిలో సంకల్ప యువ పురస్కార్ అవార్డులు ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సంకల్ప సంస్థ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఠాగూర్ బాలాజీ సింగ్ పాక రమేష్ యాదవ్ ఇమ్మడి కిరణ్ ఎగ్గు రమేష్ తిరుమల క్రాంతి బొజ్జ సురేష్ ఎర్రం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

## మున్సిపల్ ఎన్నికల్లో టి ఆర్ ఎస్ ( డి) పోటీకి సిద్ధం సిలివేరి ఇంద్ర గౌడ్



**గజ్వేల్ జనవరి 16 మన వార్త ప్రతినిధి** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సమితి ( డెమోక్రటిక్) పార్టీ పోటీ చేయడానికి సిద్ధంగా ఉందని గజ్వేల్ నియోజక వర్గం టి ఆర్ ఎస్ ( డి ) ఇంచార్జ్ సిలివేరి ఇంద్ర గౌడ్ అన్నారు గజ్వేల్ లో ఇంద్ర గౌడ్ మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సమితి. ( డి ) పార్టీ అన్ని వార్డులలో పోటీ చేయడానికి సిద్దంగా వుంది అని అన్నారు ఎవరు అయితే ఎన్నికల్లో పోటీ చేయాలి అనుకున్న వాళ్లకు మా పార్టీ నుండి బి పామ్ ఏ పామ్ ఇవ్వడానికి సిద్ధం గా వుంది టి ఆర్ ఎస్ (డి)పార్టీ నుండి పోటీ చేసే వాళ్లకు మేము మా కార్యకర్తలు మా రాష్ట్ర కమిటీ అందరం కూడా మా పార్టీ తరుపున ఎంత మంది పోటీ చేసిన అహర్నిశలు కష్ట పడి గెలిపించుకుంటాము అని అయన అన్నారు మా సింబల్. టెలిఫోన్ గుర్తు అని అన్నారు ఆశావహులు ఎవరయితే వున్నారో మమ్మల్ని సంప్రదిస్తే మేము టికెట్ ఇస్తాము మన పార్టీ ప్రజల గుండెల్లో నిలిచి పోయిన పార్టీ టి ఆర్ ఎస్ (డి) కాబట్టి పార్టీలో జిల్లా కమిటీలు పట్టణ కమిటీలు మండల కమిటీలు వార్డు కమిటీలు కొత్తగా వేస్తున్నాం ఆసక్తి వున్నవాళ్లు మమ్మల్ని సంప్రదించాలని కోరారు

## ఒకే కుటుంబంలో ఉద్యోగలు సాధించిన అక్కాచెల్లెళ్ళు

**-ఆదర్శంగా నిలిచిన మాకుల నర్సయ్య లక్ష్మి దంపతుల కుమార్తెలు...**



**హనుమకొండ,జనవరి 16 మన వార్త ప్రతినిధి** హనుమకొండ కాజీపేట్ మండలం లోని కుమ్మరిగూడెం గ్రామనికి చెందిన వారు. నేటి పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించడం ఎంతో కష్టంతో కూడుకున్న పని. అలాంటిది ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కచెల్లెళ్లు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. మాకుల నర్సయ్య, లక్ష్మి దంపతులకు నలుగురు కుమార్తెలు కాగా, అందులో ముగ్గురు ప్రభుత్వ కొలువులు సాధించి తల్లిదండ్రుల కష్టానికి తగిన ఫలితాన్ని అందించారు. వివరాల్లోకి వెళితే మాకుల నర్సయ్య, లక్ష్మి దంపతుల పెద్ద కుమార్తె మాకుల రజిని గతంలో సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేసి, ప్రస్తుతం గృహిణిగా ఉండగా. మిగిలిన ముగ్గురు సోదరీమణులు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. రెండవ కుమార్తె మాకుల శ్రీలత, రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మూడవ కుమార్తె మాకుల శ్వేత, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (TTWREIS)లో పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (PGT)గా పనిచేస్తున్నారు. చివరి కుమార్తె మాకుల సృజన, ఇటీవల ల్యాబ్ టెక్నీషియన్‌గా ఎంపికై ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించారు. కుమార్తెల స్పందన ఈ విజయంపై వారు సంతోషం వ్యక్తం చేస్తూ. మేము ఈ స్థాయికి చేరుకోవడానికి మా తల్లిదండ్రులైన నర్సయ్య, లక్ష్మి గార్ల దీవెనలే ప్రధాన కారణం. అలాగే పెళ్లి తర్వాత మా భర్తలు అందించిన ప్రోత్సాహం, సహకారం వల్లే మేము చదువుపై దృష్టి పెట్టి ఈ ప్రభుత్వ ఉద్యోగాలను సాధించగలిగాము, అని తెలిపారు. అమ్మాయిలను చదివిస్తే అద్భుతాలు సృష్టిస్తారని మాకుల నర్సయ్య కుమార్తెలు నిరూపించారు. ఒకే ఇంట్లో ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులు ఉండటం పట్ల బంధుమిత్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## జోనల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్ రాజ్ జితేందర్‌నాథ్



**మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, జనవరి 16 మన వార్త** : మల్కాజ్‌గిరి జోన్‌కు నూతనంగా నియమితులైన 2021 బ్యాచ్ ఐఏఎస్ అధికారి సంచిత్ గంగ్వార్ ని మచ్చ బొల్లారం 133 డివిజన్ కార్పొరేటర్ రాజ్ జితేందర్‌నాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డివిజన్‌కు సంబంధించిన పలు కీలక సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై జోనల్ కమిషనర్‌కు సమగ్రంగా వివరించారు.డివిజన్‌లో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల సమస్యలు, రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం, వీధిదీపాలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కార్పొరేటర్ కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు తక్షణమే అవసరమైన అనుమతులు (సాంక్షన్లు) మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని డివిజన్‌లో చేపట్టాల్సిన కొత్త అభివృద్ధి పనులపై కూడా ప్రతిపాదనలు సమర్పించారు.ఈ సమావేశంలో కార్పొరేటర్ రాజ్ జితేందర్‌నాథ్ మాట్లాడుతూ, డివిజన్ 133లో నివసిస్తున్న ప్రజలు పలు సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి జీహెచ్‌ఎంసీ అధికారులు,ప్రజాప్రతినిధుల సమన్వయం ఎంతో అవసరమని తెలిపారు. నూతన జోనల్ కమిషనర్ స్వయంగా డివిజన్‌ను సందర్శిస్తే, సమస్యలను క్షేత్రస్థాయిలో అవగాహన చేసుకొని వేగంగా పరిష్కరించవచ్చని పేర్కొన్నారు.దీనికి స్పందించిన జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ కార్పొరేటర్‌తో పాటు వచ్చిన ప్రతినిధులను ఆత్మీయంగా స్వాగతించారు. త్వరలోనే డివిజన్ 133ను సందర్శించి, అక్కడి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో తాను తనవంతు పూర్తి సహకారం అందిస్తానని స్పష్టం చేశారు.నూతన జోనల్ కమిషనర్ యొక్క సానుకూల, చురుకైన దృక్పథంతో డివిజన్ 133లో ఎన్నో రోజులుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలు త్వరలోనే పరిష్కారమవుతాయన్న నమ్మకాన్ని కార్పొరేటర్ రాజ్ జితేందర్‌నాథ్ వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో ఆనంద్‌బాగ్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, డివిజన్ 133 అధ్యక్షుడు బి.సురేందర్‌రెడ్డి, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా ఆలయాల అభివృద్ధి



**వేములవాడ, జనవరి - 16 (మన వార్త)**భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధి, విస్తరణ పనులను సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేయిస్తుందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి పారుదల, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. వేములవాడ పట్టణంలోని శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మంత్రి సీతక్క శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి సీతక్క ఆలయానికి రాగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు, అధికారులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా కోడె మొక్కు చెల్లించుకొని, భీమేశ్వర స్వామి వారికి మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. గాయత్రి మాతను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు మంత్రికి స్వామి వారి ప్రసాదం అందజేసి, వేదోక్త ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అత్యంత భక్తుల రద్దీ ఉండే ఆలయాల అభివృద్ధి, విస్తరణ పనులకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వివరించారు. వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ పనుల విషయమై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, లక్ష్మణ్ కుమార్ సీఎం దృష్టికి తీసుకెళ్లగా, సీఎం, మంత్రులు హాజరై ఆలయ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. రూ. 150 కోట్లతో రాజన్న ఆలయ విస్తరణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన వసతులు, దర్శన భాగ్యం త్వరలోనే అందుబాటులోకి రానున్నదని తెలిపారు.అలాగే మేడారంలో సమ్మక్క సారలమ్మ జాతర గద్దెల పునర్నిర్మాణం, అభివృద్ధి పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని తెలిపారు. ఆదివాసి పూజారులు, భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా గద్దెల పునర్నిర్మాణం, వివిధ అభివృద్ధి పనులు వందల ఏండ్ల పాటు నిలిచిపోయేలా.. రెండు వందల కోట్ల రూపాయలకు పైగా మంజూరు చేసి.. రానున్న తరాలకు చరిత్ర తెలిసేలా పనులు సీఎం రేవంత్ రెడ్డి చేయించారని వివరించారు. ఈ నెల 18వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు మేడారం రానున్నారని, అక్కడే కేబినెట్ సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఈ నెల 19వ తేదీన మేడారం జాతర పనులను సీఎం, మంత్రులు ప్రారంభిస్తారని వెల్లడించారు. మేడారం జాతరకు ముందు రాజన్న ఆలయాన్ని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుందని, అందులో భాగంగానే తాను ఇక్కడికి వచ్చానని వివరించారు. మేడారం జాతరకు అన్ని పార్టీల ఎమ్మెల్యేలకు స్వాగతం పలికామని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి తల్లులను దర్శించుకోవాలని కోరారు. రూ.150 కోట్లతో రాజన్న ఆలయ విస్తరణ.రూ. 150 కోట్ల నిధులతో వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులకు ప్రజా ప్రభుత్వంలోని సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో శ్రీకారం చుట్టారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్న భక్తులకు వేగంగా స్వామి వారి దర్శనం, మెరుగైన వసతులు కల్పించేలా పనులు సాగుతున్నాయని వివరించారు. ఈ ప్రాంతంపై ప్రత్యేక ఆసక్తి, చొరవతోనే సీఎం రేవంత్ రెడ్డి నిధులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. మేడారంలో కూడా అభివృద్ధి పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని తెలిపారు. మేడారంలో మొక్కలు చెల్లించుకునే ముందు వేములవాడ కు రావడం ఆనవాయితీగా వస్తుందని వివరించారు. ప్రజా ప్రభుత్వంలో ఆలయాల నిర్మాణం, విస్తరణ పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని తెలిపారు.కార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి, ఏ ఎస్పీ రుత్విక్ సాయి, వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## దోమల బెడదపై జోనల్ కమిషనర్‌కు వినతి

**-ప్రజారోగ్య పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలి కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి...**



**మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, జనవరి 16 మన వార్త** : అల్వాల్ డివిజన్‌లో పెరుగుతున్న దోమల బెడద ప్రజారోగ్యం పై తీవ్ర ప్రభావం చూపుతున్న నేపథ్యంలో,సంబంధిత సమస్యలపై మల్కాజ్‌గిరి జోనల్ కమిషనర్ సంచిత్ ను కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి కలిశారు.ఈ సందర్భంగా దోమల నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని వివరంగా తెలియజేస్తూ ఒక సమగ్ర వినతి పత్రాన్ని సమర్పించారు.డివిజన్ లో దోమల ఉత్పత్తి అధికంగా జరుగుతున్న కారణంగా ప్రజలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని కార్పొరేటర్ తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాల బారిన పడే ప్రమాదం అధికంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ పరిస్థితిని నియంత్రించేందుకు వెంటనే ఫాగింగ్, యాంటీ లార్వా కార్యక్రమాలు చేపట్టాలని, అలాగే దీర్ఘకాలిక పరిష్కారంగా శాశ్వత మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ సంచిత్ సానుకూలంగా స్పందిస్తూ, డివిజన్‌కు సంబంధించిన చెరువుల అభివృద్ధి, దోమల నియంత్రణకు అవసరమైన పనులకు ఇప్పటికే సాంక్షన్లు మంజూరు అయ్యాయని తెలిపారు. అతి త్వరలోనే ఆయా పనుల అమలు ప్రారంభమవుతుందని హామీ ఇచ్చారు.కమిషనర్ ఇచ్చిన భరోసాను కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి స్వాగతిస్తూ, ఈ పనులు సకాలంలో పూర్తయితే డివిజన్‌లో దోమల బెడద గణనీయంగా తగ్గి ప్రజారోగ్య పరిస్థితులు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు ఈ అంశాన్ని నిరంతరం పర్యవేక్షిస్తామని, ప్రజలకు స్పష్టమైన ఉపశమనం కలిగేలా కృషి చేస్తామని తెలిపారు.

## జమ్మికుంట లో బిజెపి సంబరాలు..



**జమ్మికుంట, జనవరి 16( మన వార్త ప్రతినిధి)**:మహారాష్ట్రలోని మున్సిపల్ ఎన్నికలలో బిజెపి గెలుపుకు హర్శిస్తూ జమ్మికుంట లో భాజపా నాయకులు సంబరాలు చేసుకున్నారు.మహారాష్ట్రలో జరిగిన మున్సిపల్, కార్పోరేషన్ ఎన్నికలలో మొత్తం 227 మున్సిపాలిటీలకు గాను 150 పైగా మున్సిపాలిటీలను బిజెపి పార్టీ కైవసం చేసుకుకోవడం బిజెపి పార్టీ అత్యధిక సంఖ్యలో మున్సిపాలిటీల గెలుపును హర్షిస్తూ జమ్మికుంట పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు ఆధ్వర్యంలో టపాసులు కాల్చి, స్వీట్ పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు.ఈసందర్భంగా కొలకాని రాజు, ఆకుల రాజేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారథ్యంలో దేశంలో ఏ ఎన్నిక జరిగిన ప్రజలు బిజెపి పార్టీని ఆదరిస్తున్నారని, మహారాష్ట్ర లో వెలువడిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు దీనికి నిదర్శనం అని చెప్పారు. 227 మున్సిపాలిటీల్లో 150 పైగా మున్సిపల్ చైర్మన్ లను గెలుచుకుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో గత పది సంవత్సరాల బిఆర్ఎస్, రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలన పై ప్రజలు విరక్తి చెందారని, ఎన్నికల హామీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేయడం లేదని, నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్ళు ఇవ్వకుండా, రైతులకు రైతు బంధు నిధులు ఇప్పటి వరకు వేయలేదని, అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ, బిఆర్ఎస్ పార్టీలు రెండు మోసం చేశాయని, వీటికి బుద్ధి చెప్పడానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూడా బిజెపి జండా ఎరుతదని చెప్పారు. ప్రజలు నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అభివృద్ధిని చూసి, కేవలం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే మున్సిపాలిటీలు అభివృద్ధి చెందుతాయని, అవినీతి రహిత పాలన బిజెపి పార్టీకి మాత్రమే సాధ్యం కాబట్టి జమ్మికుంట మున్సిపాలిటీ ప్రజలు బిజెపి పార్టీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సంపెల్లి సంపత్ రావు, రాజేష్ ఠాకుర్, బచ్చు శివన్న, పల్లెపు రవి, ఇటుకాల స్వరూప, నిరూపరాణి, బూరుగుపల్లి రాము, యాంసాని సమ్మయ్య, ఈశ్వర్, పత్తి జనార్ధన్ రెడ్డి, ఆకుల పోచయ్య, తిరుపతి, పొనగంటి రవి, గుర్రం పరుశు రాం, గట్టు రాకేష్, ఆవాంచ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## యువత గ్రామాల అభివృద్ధిపై, క్రీడలపై మొగ్గు చూపాలి....



**-మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి...**

**చిన్న శంకరంపేట జనవరి 16 ( మన వార్త ప్రతినిధి )** చిన్నశంకరంపేట్ మండలం చేన్నాయిపల్లి గ్రామంలో సంక్రాంతి సంబరాల లో భాగంగా జరిగిన కబడ్డీ, వాలీబాల్ సీజన్ 2 టోర్నమెంట్ కు ముఖ్య అతిథిగా విచ్చేసి గెలుపొందిన విజేతలకు మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరూ మొబైల్ ఆన్లైన్ గేమ్స్ ల వైపు వెళ్లకుండా ఇలాంటి క్రికెట్ కబడ్డీ లాంటి క్రీడలను ప్రోత్సహిస్తూ యువకులు ముందుకెళ్తే శారీరిక దారుఢ్యాం, మానసిక ఉల్లాసం పెంపొందించుకోవడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారుఈ కార్యక్రమంలో చేన్నాయిపల్లి సర్పంచ్ బత్తురాజు భూమయ్య, ఉప సర్పంచ్ గంట రమేష్, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు రాజు, వార్డ్ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచ్ లు మండల నాయకులు, గ్రామ యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్, కార్పొరేషన్, చైర్మన్ స్థానాలలో బీసీలకు అన్యాయం

**మంచిర్యాల, జనవరి 16 (మన వార్త ప్రతినిధి)**:మున్సిపల్, కార్పొరేషన్, చైర్మన్ స్థానాల్లో సీట్ల కేటాయింపులో బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తుందని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తా ప్రాంతంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర జనాభా లో 56 శాతం బీసీ జనాభా ఉన్నప్పటికీ మున్సిపల్, కార్పొరేషన్ చైర్మన్ స్థానాలలో బీసీలకు అన్యాయమే జరిగిందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 121 మున్సిపల్ చైర్మన్ స్థానాలు ఉంటే బీసీలకు కేటాయించిన స్థానాలు కేవలం 38 మాత్రమే అని, బీసీ జనాభా ప్రాతిపదికన 60 స్థానాలు కేటాయించాల్సిన స్థానాల్లో కేవలం 38 మాత్రమే కేటాయించడం అంటే బీసీల పట్ల వివక్ష అన్యాయం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా పది కార్పొరేషన్లు ఉంటే బీసీల జనాభా ప్రాతిపదికన కేటాయించాల్సిన స్థానాలు ఐదు అయితే కేటాయించిన స్థానాలు కేవలం మూడు మాత్రమే ఇది అన్యాయం కాదా అని అన్నారు. మా జనాభా ఎంతో మా వాటా అంత కావాలని ఉద్యమాలు నడుస్తున్నప్పటికీ తమ న్యాయమైన వాటా ఇవ్వకపోవడం బాధాకరమని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో, నగరపాలక సంస్థల్లో ఇవ్వాల్సిన స్థానాలు జనాభా దామాషా ప్రకారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేయడానికి సిద్ధంగా ఉన్నామని, రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి శాఖపూరి భీమ్సేన్, చంద్రగిరి చంద్రమౌళి, రాజన్న చారి తన్నీరు భీమ్రావు, ఎగ్గన లింగన్న తదితరులు పాల్గొన్నారు.



## రుద్రంగిని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతాం




**రుద్రంగి, జనవరి 16 (మన వార్త)**రుద్రంగిని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు. రుద్రంగి మండల కేంద్రంలో సర్వ శిక్ష నిధులు రూ. 48. 60 లక్షల నిధులతో మండల రిసోర్స్ భవనం (ఎంఆర్సీ) నిర్మించగా, శుక్రవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ప్రారంబించారు. అనంతరం గ్రామ పంచాయతీ భవనం ఆవరణలో 21 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. రుద్రంగిలో పలు ప్రభుత్వ కార్యాలయాల కోసం ఇంటిగ్రేటెడ్ భవనాన్ని త్వరలోనే నిర్మిస్తామని హామీ ఇచ్చారు. స్థానికుల కోరిక మేరకు క్రీడల కోసం మైదానం ఏర్పాటు చేస్తామని చెప్పారు. జిల్లాలోని యువత, విద్యార్థుల నైపుణ్య అభివృద్ధి, ఉపాధి పొందేందుకు శిక్షణ అందించే అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ కోసం రూ. 42 కోట్లు మంజూరు చేసిందని, టెండర్లు పూర్తి అయ్యాయని త్వరలోనే పనులు మొదలు పెడుతామని తెలిపారు. టాటా కంపెనీ సహకారం, బాగస్వామ్యంతో దీనిలో మొత్తం ఆరు కోర్సులు అందుబాటులోకి వస్తాయని వివరించారు. మార్క్ ఫెడ్ ఆద్వర్యంలో గోదాం నిర్మాణానికి స్థలం గుర్తిసున్నామని, దాని పనులు ప్రారంబిస్తామని చెప్పారు. వేములవాడ నియోజకవర్గంలో రుద్రంగి రెండో అతి పెద్ద గ్రామమని తెలిపారు. విశాలమైన రోడ్లు, మురుగు కాలువలు నిర్మిస్తున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు నియోజకవర్గం అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తున్నారని తెలిపారు. కలికోట-సూరమ్మ ప్రాజెక్టు నిర్వాసితులకు త్వరలో పరిహారం పంపిణి చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వ భూములను ప్రభుత్వ అభివృద్ధి పనులకు వినియోగిస్తామని, కబ్జాలో ఉన్న భూమి లేని అర్హులైన నిరుపేదల భూములు తీసుకోమని స్పష్టం చేసారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి నియోజకవర్గానికి త్వరలోనే సాగు నీటిని విడుదల చేయిస్తానని తెలిపారు. 132/33 సబ్ స్టేషన్ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని, విద్యుత్ సమస్యలు లేకుండా చేస్తామని భరోసా ఇచ్చారు. 5 కోట్ల పై చిలుకు నిధులతో సీసీ రోడ్లు నిర్మాణం చేసినట్లు తెలిపారు. ఇందిర చౌక్ నుంచి కుక్కుల గండి వరకు రూ. 4 కోట్ల 57 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం, రుద్రంగి నుంచి దసరా నాయక్ తండా అప్రోచ్ సీసీ రోడ్డు హై లెవల్ బ్రిడ్జి 2 కోట్లు 50 లక్షలతో రోడ్డు నిధులు మంజూరు అయ్యాయని పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని వివరించారు. 50 ఏళ్లుగా రుద్రంగి గ్రామస్థులు ఎదురు చూస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి కి 1 కోటి 50 లక్షల రూపాయలు మంజూరు చేసి 30 పడుకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టామని తెలిపారు. రుద్రంగి నుండి రామకృష్ణ పూర్ పల్లెకు వెళ్ళాలంటే ఎన్నో కష్టాలు పడేవారని, తానూ గెలిచిన 6 నెలల్లో రూ.62 లక్షలతో కల్వర్టు నిర్మాణం పూర్తి చేశానని పేర్కొన్నారు. అంబేద్కర్ చౌరస్తా నుండి ఇందిరా చౌక్ వరకు 1 కోటి 50 లక్షల రూపాయలతో రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టామని, రుద్రంగి గ్రామంలో ప్రధాన రహదారి పై ఇరువైపులా 2 కోట్లతో డ్రైనేజీ నిర్మాణం చేపట్టామని, నూతన పోలిస్ స్టేషన్ నిర్మాణం కోసం 2 కోట్ల 50 లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసిందని వెల్లడించారు. రైతులు అంగీకరిస్తే వారికి నష్ట పరిహారం చెల్లించి అచ్చయ్య కుంట లో ,నగరాం చెరువును నీటితో నింపుతామని స్పష్టం చేసారు. భవనంతో సమావేశాలకు ఉపయోగం రుద్రంగిలో మండల రిసోర్స్ భవనం (ఎంఆర్సీ) అందుబాటులోకి రావడంతో విద్యాభివృద్ధి సమావేశాలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. అలాగే ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లితండ్రుల సమావేశాలు నిర్వహించవచ్చని వివరించారు. వివిధ ప్రభుత్వ కార్యాలయ భవనాల కోసం ఇంటి గ్రేటేడ్ భవనాన్ని నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం అన్ని వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నారాయణ,ఉప సర్పంచ్ మాడిశెట్టి అభిలాష్,మార్కెట్ కమిటి చైర్మెన్ చేలుకల తిరుపతి, వేములవాడ ఆర్డీఓ రాదాభాయి, డీఈఓ వినోద్ కుమార్, టీజీ ఈడబ్ల్యూ ఐడీసీఈఈ అశోక్ కుమార్, డీఈ సత్యనారాయణ, తహసిల్దార్ పుష్పలత, ఎంపీడీఓ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల తుది జాబితా పూర్తి...

**-మునిసిపల్ కమీషనర్ మహమ్మద్ అయాజ్...**

**జమ్మికుంట, జనవరి 16( మన వార్త ప్రతినిధి):**రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జమ్మికుంట మున్సిపాలిటీ లోని పోలింగ్ కేంద్రాలను చివరి పబ్లికేషన్ చేసి జమ్మికుంట మునిసిపల్ కార్యాలయంలోని నోటిస్ బోర్డు లో అంటించినట్లు కమిషనర్ మహమ్మద్ అయాజ్ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు తుది జాబితా పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జి రాజిరెడ్డి, టిపివో శ్రీధర్,టిపిబివో దీపిక,ఎఈ వికాస్, సీనియర్ అస్సిస్టేంట్లు వాణి, భాస్కర్,వార్డ్ అధికారులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## పేదలను ఆదుకునే గొప్ప మానవత్వం దయాగుణం

**-బీసీ సంక్షేమ సంఘం ములుగు జిల్లా ఉపాధ్యక్షులు మంచర్ల నాగేశ్వరావు,ములుగు జిల్లా కార్యదర్శి బట్ట నాగేందర్...**

**వెంకటాపురం జనవరి 16 మనవార్త** మండలంలోని వీరబాద్రవరం గ్రామంలో అనాధ అయి అనారోగ్యంతో బాధపడుతున్న తెల్లం రమణయ్యను రాత్రి వేళలో కుక్కలు దాడి చేయడం వలన తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకొని హాస్పిటల్ కి తరలించడం జరిగింది. ఆనారోగ్య ఖర్చుల నిమత్తం 3000 రూపాయలు,బట్టలు,దుప్పట్లు అందజేసి మానవత్వం చాటుకున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం ములుగు జిల్లా ఉపాధ్యక్షులు మంచర్ల నాగేశ్వరావు,ములుగు జిల్లా కార్యదర్శి బట్ట నాగేందర్, గ్రామ పంచాయతీ సర్పంచ్ సోలం హోంపతి. గొప్ప మానవత్వం,దయగుణంతో మంచర్ల నాగేశ్వరావు గ్రామంలోని పేద కుటుంబాలకు ఆర్థిక చేస్తున్నారు. పేదలకు ఆర్థికపరంగా అండగా ప్రతిఒక్కరు నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు యూత్ సభ్యులు సోలం సుధాకర్,మునిగేల హరిక్షేత్రం,సోలం లక్ష్మయ్య,కోడిరెక్కల బాబు, మాటూరి నాగప్రవీణ్,సోలం సతీష్ గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




## మున్సిపాలిటీలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తాం

**-రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి...**

**మంచిర్యాల, జనవరి 16 (మన వార్త ప్రతినిధి):**జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. శుక్రవారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజు, మందమర్రి మండల తహశీల్దార్ సతీష్, డిసిసి అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి లతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ, మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని, చెన్నూరు నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని అనుసంధానం చేస్తూ అంతర్గత రహదారులు నిర్మించడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా మురుగు కాలువల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన నిరుపేదలకు పథకం ఫలాలు అందించేందుకు అధికార యంత్రాంగం సమన్వయంతో చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అమృత్ పథకంలో ఇంటింటికీ నల్లా కనెక్షన్ ద్వారా నిరంతరం శుద్ధమైన త్రాగునీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలోని 1వ వార్డు అల్లూరి నగర్‌లో 73 లక్షల 46 వేల రూపాయలు, 2వ వార్డు తిలక్‌నగర్‌లో 72 లక్షల 56 వేల రూపాయలు, 7వ వార్డులో 72 లక్షల 56 వేల రూపాయలు, 8వ వార్డు చైతన్య కాలనీలో 1 కోటి 89 లక్షల రూపాయలు, 9వ వార్డు ఆర్‌ఆర్ నగర్‌లో 46 లక్షల రూపాయలు, న్యూ తిమ్మాపూర్‌లో 52 లక్షలు 50 వేల రూపాయలు, ఓల్డ్ తిమ్మాపూర్‌లో 44 లక్షల 50 వేల రూపాయలు, 12వ వార్డు గాంధీనగర్ ప్రాంతంలో 6 లక్షలు 17 వేల రూపాయలు, 13వ వార్డు ఆమ్‌నగర్ ప్రాంతంలో 6 లక్షల 17 వేల రూపాయలు, 14వ వార్డు మల్లికార్జున నగర్ ప్రాంతంలో 27 లక్షల 22 వేల రూపాయలు, 16వ వార్డు గంగా కాలనీలో 34 లక్షల 64 వేల రూపాయల అంచనా వ్యయంతో టియుఎఫ్‌ఐడిసి, డిఎంఎఫ్టి, సిఎస్‌ఆర్, నగర అభివృద్ధి నిధులతో పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని చెన్నూరు నియోజకవర్గ పరిధిలో గల ప్రతి ప్రాంతాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపల్ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులను ప్రణాళికబద్ధంగా వినియోగించి పనులను త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వచ్చే వేసవిలో ప్రతి ఇంటికి నిరంతరం త్రాగునీటిని అందించేందుకు అమృత్ పథకం క్రింద నీటి ట్యాంకులు, ఇతర అనుబంధ పనులను చేపట్టి కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు కనీస అవసరాలను తీర్చేందుకు అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## రహదారి భద్రతపై ప్రజలకు,వాహనదారులకు అవగాహన




**బెజ్జంకి, జనవరి 16( మన వార్త ప్రతినిధి)**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని దాచారం గ్రామంలో రహదారి భద్రతపై గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సౌజన్య మాట్లాడుతూ వాహనదారులకు రహదారి భద్రత ఎంత ముఖ్యమో వివరించారు. మోటారు వాహనాలు నడుపుతున్న సమయంలో రోడ్డు నియమాలను పాటించకపోవడం వల్ల జరిగే ప్రమాదాలు,వాటి వల్ల ప్రాణనష్టం జరుగుతున్న విషయాలను అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని,అతివేగాన్ని నియంత్రించుకోవాలని, హెల్మెట్,సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలని, మొబైల్ ఫోన్ వినియోగించకుండా వాహనాలు నడపాలనీ,అలాగే రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి వాహనదారి బాధ్యత ఎంతో కీలకమని, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏదైనా సైబర్ నేరం జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కీ సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి ఏఎస్సై శంకర్ రావు, బెజ్జంకి పోలీసులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బెంచీలు వితరణ..



**జమ్మికుంట, జనవరి 16( మన వార్త ప్రతినిధి):**ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాలలో సిమెంటు బెంచీలు అందజేశారు. ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పరికిపండ్ల నరహరి సూచనల మేరకు కోఆర్డినేటర్ గుణసాగర్ ఆధ్వర్యంలో శుక్రవారం జమ్మికుంట తహసిల్దార్ కార్యాలయం,ఎంపీడీవో కార్యాలయశీలో సిమెంట్ బెంచీలు అందజేశారు. ప్రజల సౌకర్యం కోసం అనేక కార్యక్రమాలు ఆలయ ఫౌండేషన్ నిర్వహిస్తుందని గుణసాగార్ అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకట్ రెడ్డి, ఎంపీడీఓ పద్మావతి, ఇల్లందకుంట శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు,సలీం,భాస్కర్ తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్వామివారి జాతరలో ప్రత్యేక ఆకర్షణ..




**ఇల్లంతకుంట,జనవరి 16 (మన వార్త ప్రతినిధి)** ఇల్లంతకుంట మండలంలోని జంగారెడ్డి పల్లె గ్రామంలో నిర్వహించిన శ్రీ రామలింగేశ్వర స్వామి జాతరలో ఈ ఏడాది కూడా ప్రత్యేక ఆకర్షణగా మేకపోతుల బండ్ల ప్రదర్శన జరిగింది. కేశన్న పల్లె కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆలయం చుట్టూ ప్రతి ఏటా సంప్రదాయంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా మేకపోతులతో అలంకరించిన బండిని ఊరేగించారు. ఈ సాంప్రదాయ బండ్ల ఆదర్శను కేశన్న పల్లె గ్రామ సర్పంచ్ పోతరాజు చంటి శ్రీ మల్లికార్జున కురుమ సంఘం సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై సిరిసిల్ల అశోక్,గ్రామ ప్రజలు,మండల ప్రజలు తదితరులు పాల్గొని ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు మరియు సందర్శకులు ఈ ప్రత్యేక ప్రదర్శనను ఆసక్తితో ఆస్వాదించారు.

## అల్వాల్‌లో 'ARRIVE and ALIVE' రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం




**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జనవరి 16 మన వార్త:** రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా అల్వాల్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం "ARRIVE and ALIVE" రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం అల్వాల్ పరిధిలోని జీహెచ్ఎంసీ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి, అల్వాల్ పోలీస్ స్టేషన్లలో జరిగింది. ఈ అవగాహన కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సిబ్బంది, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, అల్వాల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది చురుకుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత ప్రాముఖ్యత, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం,హెల్మెట్ వినియోగం,సీటుబెల్ట్ ధరించడం,మద్యం సేవించి వాహనాలు నడపకూడదనే అంశాలపై అవగాహన కల్పించారు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాలకు ప్రమాదంగా మారుతుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో వాహనాలు నడపాలని సూచించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తామని, రోడ్డు భద్రతకు సహకరిస్తామని ప్రమాణ స్వీకారం చేశారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా ప్రజల్లో రోడ్డు భద్రతపై స్పష్టత పెరిగి, ప్రమాదాలు తగ్గుతాయని పోలీసులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## అల్వాల్‌లో నిర్మాణ భవనం నుంచి పడి యువకుడు మృతి




**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జనవరి 16మన వార్త:**అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీ ఎన్‌క్లేవ్, శివాలయం కాలనీ, సెయింట్ మైఖేల్ స్కూల్ సమీపంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న ఐదు అంతస్తుల భవనం నుంచి పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం సాయంత్రం వెలుగుచూసింది.పోలీసుల వివరాల ప్రకారం, ఒడిశా రాష్ట్రానికి చెందిన భీమా వయస్సు సుమారు 25 30 సంవత్సరాలు) అనే యువకుడు నిర్మాణంలో ఉన్న భవనం ఐదో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. ఈ ఘటన సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో చోటుచేసుకుంది.తీవ్ర గాయాల పాలైన భీమా అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, పంచనామా నిర్వహించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. నిర్మాణ పనుల సమయంలో భద్రతా చర్యల్లో లోపాలున్నాయా? అనే అంశాలపై కూడా విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

## మిర్జాపల్లిలో కొలిక్కి వచ్చిన రోడ్డు సమస్య...



**చిన్న శంకరంపేట జనవరి 16 ( మన వార్త ప్రతినిధి )** చిన్న శంకరంపేట మండలంలోని మిర్జాపల్లి గ్రామంలో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి లోకి చెరువు బ్యాక్ వాటర్ వచ్చినప్పుడు నెలకొన్న దారి సమస్య కొలిక్కి వచ్చింది, వర్షాకాలంలో అండర్ పాస్ బ్రిడ్జిలోకి నీరు చేరి రాకపోకలు నిలిచిపోతున్నాయి, గ్రామస్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారు దీంతో ఇటీవల రైల్వే డబుల్ లైన్ ఏర్పాటుకు బ్రిడ్జి విస్తీర్ణం కోసం స్థల పరిశీలనకు రైల్వే అధికారులు సర్వే కోసం రావడం జరిగింది, సర్వే నిర్వహించవద్దని రోడ్డు సమస్య తీర్చే వరకు సర్వే చేసేది లేదంటూ గ్రామస్తులు అడ్డుకున్నారు, దారి కోసం గ్రామస్తులు గురువారం స్థానిక సర్పంచ్ సునీత యాదగిరి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు, ఈ సందర్భంగా గ్రామానికి వచ్చే ప్రత్యామ్నాయ దారి గ్రామంలో గతంలో ఉన్న దారి గత కొద్ది రోజుల క్రితం మూసివేసిన విషయంపై చర్చించారు, మాజీ ఉపసర్పంచ్ మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో గతంలో మూసివేసిన దారిని ఎప్పటిలా దారిని ఏర్పాటు చేస్తే గ్రామానికి ప్రత్యామ్నాయంగా దారి ఏర్పాటు చేద్దామనుకుంటున్న దారికి తన స్థలంలో నుంచి దారి ఇచ్చేందుకు పొలం యజమాని మాజీ జెడ్పిటిసి పోతరాజు రమణ ఒప్పుకున్నారు, ఈ రెండు దారులను ఏర్పాటు చేసేందుకు గ్రామస్తులు అందరు కలిసి స్థల పరిశీలన చేశారు, శనివారం నుంచి పనులు మొదలు పెట్టేందుకు నిర్ణయం తీసుకున్నారు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజు, కాంగ్రెస్ బిజెపి మండల నాయకులు సాన సత్యనారాయణ, రాజిరెడ్డి, ప్రభాకర్ గంగాధర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, సంజీవ్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు

## లైన్మెన్ కు విద్యుత్ షాక్ తీవ్ర గాయాలు ఆస్పత్రికి తరలింపు...




**చిన్న శంకరంపేట జనవరి 16 ( మన వార్త ప్రతినిధి)** విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ నిర్లక్ష్యం వల్ల లైన్మెన్ కు విద్యుత్ షాక్ తగిలి తీవ్ర గాయాలైన సంఘటన చిన్న శంకరంపేట మండలం దారిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది శుక్రవారం చిన్న శంకరంపేట మండలం దరిపల్లి గ్రామం లో వ్యవసాయ విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్ ఫీజు వైర్ ఎగిరిపోవడంతో లైన్మెన్ బిక్షపతి సబ్‌స్టేషన్ ఆపరేటర్ అజీజ్ కు ఫోన్ చేసి ఎల్ సి తీసుకోవడంతో ధర్పల్లి వ్యవసాయ విద్యుత్ లైన్ సరఫరాను నిలిపివేశారని ట్రాన్స్ఫార్మర్ వద్దకు వెళ్లిన లైన్మెన్ బిక్షపతి ఫ్యూస్ వేర్ వేస్తుండగా విద్యుత్ షాక్ కు గురయ్యాడు. ఒకసారి గా విద్యుత్ షాక్ లైన్మెన్ బిక్షపతి చేతికి తగలడంతో కిందపడిపోయాడు స్థానికులు ఈ విషయాన్ని గమనించి అతని వెంటనే హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు, ధర్పల్లి వ్యవసాయ ఫీడర్ విద్యుత్ సరఫరా బంద్ చేయాల్సిన ఆపరేటర్ బాకీర్తి పల్లి గ్రామానికి చెందిన ఫీడర్ లైన్ విద్యుత్తు బందు చేయడంతో దరిపల్లి ఫీడర్ కు విద్యుత్ సరఫరా జరిగి లైన్ మెన్ బిక్షపతి విద్యుత్ శాఖ్ కు గురైనట్లు మండల విద్యుత్ అధికారి దినకర్ తెలిపారు. ఈ విషయంపై ఉన్నత అధికారులకు నివేదిక పంపించినట్లు ఆయన తెలిపారు.

## భద్రాచలంలో వైభవంగా విశ్వరూప సేవ



**భద్రాచలం, జనవరి 16.( మన వార్త ప్రతినిధి).**భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో విశ్వరూప సేవను శాస్త్ర సంప్రదాయాలకు అనుగుణంగా ఘనంగా నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు 15 రోజుల అనంతరం వచ్చే బహుళ ద్వాదశి రోజున జరిగే ఈ విశిష్ట సేవకు విశేష ప్రాధాన్యత ఉంది.ఈ సందర్భంగా శ్రీ సీతారామ చంద్రస్వామివారితో పాటు ఆలయంలోని అన్ని ఉత్సవ మూర్తులు, ముక్కోటి దేవతలను ఒకే స్థలంలో చేర్చి ప్రత్యేక పూజలు, ఆరాధనలు నిర్వహించారు. ఈ సేవ ద్వారా శ్రీరాముడు భక్తులకు తన విశ్వరూప దర్శనాన్ని అర్పించినట్లుగా భావిస్తారు.సంప్రదాయానుగుణంగా మహా ప్రభుత్వోత్సవ క్రతువుతో కలిపి నిర్వహించిన ఈ సేవ ఆలయ ప్రాంగణాన్ని దైవమయ వాతావరణంతో నింపింది. విశ్వరూప సేవను దర్శించుకునేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తుల జయజయధ్వానాలతో భద్రాచలం విష్ణుక్షేత్రం ఆధ్యాత్మిక శోభతో అలరారింది.

## అనంతారం గ్రామంలో వెలుగుల పండుగ..



**ఇల్లంతకుంట,జనవరి 16** ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామంలో శుక్రవారం హైమాస్ లైట్లు,గ్రామ వీధి స్తంభాల లైట్లను పూర్తిస్థాయిలో చేపట్టి గ్రామాన్ని వెలుగులతో నింపినట్లు నూతన సర్పంచ్ వొల్లాల రజిత వెంకటేశం తెలిపారు.గత కొంతకాలంగా పనిచేయని హైమాస్ లైట్లు,వీధి దీపాలను గుర్తించి రాత్రి వేళ గ్రామ వీధులు పూర్తిగా ప్రకాశవంతంగా మారాయని పేర్కొన్నారు.సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామంలో పండుగ సందడి అధికంగా ఉండనున్న నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.ముఖ్యంగా పిల్లలు,వృద్ధులు రాత్రివేళ బయటకు వచ్చే సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా లైటింగ్ వ్యవస్థను సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.అలాగే పండుగ రోజులలో విద్యుత్ లైన్లు,లైట్ల వద్ద జాగ్రత్తలు పాటించాలని గ్రామస్తులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కదం జయంత్,వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు,గ్రామస్తులు పాల్గొని పంచాయతీ చేపట్టిన చర్యలను అభినందించారు.

## విజేతగా 'ఫ్రెండ్స్ ఫరెవర్', రన్నరప్‌గా 'శివసేన' జట్లు




**ఆత్మకూర్:** శ్రీ మేధ వి జూనియర్ కాలేజీలు మరియు లిటిల్ మేధ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆత్మకూర్ ప్రీమియర్ లీగ్' ( ఏ పి ఎల్) సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్ అత్యంత ఉత్సాహభరితంగా, ప్రశాంత వాతావరణంలో ముగిసింది.**పోటాపోటీగా ఫైనల్స్:**ఈ టోర్నమెంట్‌లో పలు జట్లు తలపడగా, తుది పోరులో 'ఫ్రెండ్స్ ఫరెవర్' (ఫ్రెండ్స్ ఫర్ ఎవర్) జట్టు అద్భుత విజయాన్ని అందుకుని విజేతగా నిలిచింది. కడవరకు పోరాడిన 'శివసేన' (శివ సేన) జట్టు రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకుంది.**అతిథుల ప్రసంగం:**ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పర్వతగిరి సర్పంచ్ మహేశ్వరి రాజు, పావని రవి, కొంపెల్లి రవి, మరియు జయపాల్ రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి తోడ్పడతాయని వారు ఈ సందర్భంగా కొనియాడారు.**శ్రీ మేధ విద్యాసంస్థల డైరెక్టర్ ప్రసంగం:**శ్రీ మేధ విద్యాసంస్థల డైరెక్టర్ కందగట్ల నరేంద్ర మాట్లాడుతూ.. యువతలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యంగా ఈ టోర్నమెంట్ నిర్వహించామని తెలిపారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి, క్రీడా స్ఫూర్తిని చాటడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు ముందుండాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, స్థానిక ప్రజలు మరియు శ్రీ మేధ విద్యాసంస్థల సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని టోర్నమెంట్‌ను విజయవంతం చేశారు.ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పర్వతగిరి సర్పంచ్ మహేశ్వరి రాజు, పావని రవి, కొంపెల్లి రవి, జయపాల్ రెడ్డి లతో పాటు తళ్ళ కిరణ్, మంతుర్తి రవి, మార్త కేదారి, చిమ్మని దేవరాజు, వడ్డెపల్లి వేణు, గుండెబోయిన శ్యామ్, మరియు కుక్కల రమేష్ హాజరయ్యారు.

## థైరాయిడ్ నిర్లక్ష్యానికి మూల్యం ఎంత?



- మహిళల్లో పెరుగుతున్న థైరాయిడ్ సమస్యలు...
- మౌనంగా మొదలయ్యే లక్షణాలుడ ఆలస్యంగా తెలిసే ప్రమాదం...
- ముందస్తు పరీక్షలే రక్షణడ అవగాహనే పరిష్కారం...

**డెస్క్,** మహిళల్లో థైరాయిడ్ సమస్యలు నిశ్శబ్దంగా పెరుగుతూ, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అలసట, అకారణ బరువు పెరుగుదల లేదా తగ్గుదల, జుట్టు రాలడం, మానసిక అస్థిరత వంటి లక్షణాలు కనిపించినా, చాలా మంది మహిళలు వాటిని సాధారణ సమస్యలుగానే భావిస్తున్నారు. ఈ నిర్లక్ష్యమే భవిష్యత్తులో తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తోందన్న హెచ్చరికలు వైద్య వర్గాల నుంచి వస్తున్నాయి. పురుషులతో పోలిస్తే మహిళల్లో థైరాయిడ్ వ్యాధులు అనేక రెట్లు ఎక్కువగా నమోదవుతున్నాయి.

థైరాయిడ్ గ్రంథి శరీరంలోని హార్మోన్ల సమతుల్యతను నియంత్రించే కీలక బాధ్యతను నిర్వహిస్తుంది. ఈ సమతుల్యత దెబ్బతింటే శరీరంలోని అనేక వ్యవస్థలు ప్రభావితమవుతాయి. ముఖ్యంగా మహిళల్లో గర్భధారణ, ప్రసవానంతర దశ, మెనోపాజ్ వంటి సమయంలో హార్మోన్ల మార్పులు ఎక్కువగా ఉండటంతో థైరాయిడ్ సమస్యల ముప్పు మరింత పెరుగుతోంది. అయినప్పటికీ కుటుంబ బాధ్యతలు, పనిభారం కారణంగా తమ ఆరోగ్యాన్ని పక్కన పెట్టే పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది.థైరాయిడ్ సమస్యలను నిర్లక్ష్యం చేస్తే మూల్యం చాలా భారంగా మారుతుంది. గర్భధారణలో సమస్యలు, గర్భస్రావాల ప్రమాదం, పిల్లల్లో ఎదుగుదల లోపాలు, గుండె జబ్బులు, దీర్ఘకాలిక మానసిక ఒత్తిడి వంటి పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా యువతుల్లో ఈ సమస్య నియంత్రణలో లేకపోతే, భవిష్యత్ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.అవగాహన లోపమే ప్రధాన సమస్యగా మారింది. చిన్న లక్షణాలను గుర్తించి, సమయానికి సాధారణ రక్త పరీక్షలు చేయించుకుంటే థైరాయిడ్‌ను పూర్తిగా నియంత్రించవచ్చు. కానీ పరీక్షలపై భయం, సమయం లేదన్న భావన, ఖర్చుల భారం వంటి కారణాలతో మహిళలు పరీక్షలను వాయిదా వేస్తున్నారు. ఫలితంగా వ్యాధి తీవ్ర స్థాయికి చేరిన తర్వాతే చికిత్సకు రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.ఈ నేపథ్యంలో ముందస్తు నిర్ధారణే నిజమైన రక్షణ మార్గమని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు, సమతుల ఆహారం, ఒత్తిడిని తగ్గించే జీవనశైలి, వైద్యుల సూచనలతో క్రమమైన చికిత్స తీసుకోవడం అత్యంత అవసరం. మహిళల ఆరోగ్యానికి కుటుంబాలు, సమాజం కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.మహిళల్లో పెరుగుతున్న థైరాయిడ్ సమస్యలు వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు, ఒక సామాజిక ఆరోగ్య సవాలుగా మారాయి. నిర్లక్ష్యానికి మూల్యం ఎంత భారమైనదో ఇప్పుడే గుర్తించి, అవగాహనతో ముందడుగు వేయాల్సిన సమయమిదే. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు మూల్యం చెల్లించాల్సి వస్తుందన్న సత్యాన్ని ఈ బ్యానర్ వార్త స్పష్టంగా చెబుతోంది.

## పేదల సంజీవనితో ప్రయోజనాలు మెండు..



ప్రస్తుత ఆహార అలవాట్లు, మారుతున్న జీవన శైలి వల్ల ఎన్నో సమస్యలు వస్తున్నాయి. సమయం లేకపోవడం, సరైన ఫుడ్ తీసుకోకపోవడం, టెన్షన్ వంటి వాటి వల్ల ఆరోగ్యం దెబ్బతింటుంది.అందుకే కొన్ని ఆహార నియమాలను డైట్ లో చేర్చుకోవాలి అంటారు నిపుణులు. కొన్ని ఖర్చుతో కూడుకున్నవి అయితే మరికొన్ని చవకగా దొరుకుతాయి. మీకు బార్లీ తెలుసా? పేదల పాలిట పెన్నిది. బార్లీలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఇందులో ఉండే పోషకాలు ఎన్నో సమస్యలకు దివ్యౌషధాలుగా ఉపయోగపడుతాయి. అందుకే బార్లీ నీటిని ప్రతి రోజు ఉదయం తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల శరీరానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. పేదల సంజీవని అయినా బార్లీ డయాబెటిస్ కు చాలా మంచిది. బార్లీ నీరు రక్తంలో చక్కెర స్థాయిని తగ్గించడానికి, నియంత్రించడానికి ఉపయోగపడుతాయి. హృదయనాళ ఆరోగ్యాన్నిమెరుగుపరచడమే కాదు.. రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది. ఈ బార్లీ నీటిలో ఫైబర్ శాతం ఎక్కువ ఉంటుంది. ఇవి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. దీనివల్ల మలబద్ధక సమస్య దూరం అవుతుంది. శరీరంలో ఉన్న అదనపు కొవ్వును కూడా తగ్గిస్తుంది బార్లీ నీటిలో తక్కువ క్యాలరీలు ఉంటాయి కాబట్టి కావలసిన శక్తి కూడా అందుతుంది. బరువు పెరగరు. బార్లీ గింజలను ఉడకబెట్టి వడకట్టిన తర్వాత కాస్త రుచి కోసం నిమ్మరసం కూడా జోడిరచవచ్చు. యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ కి అద్భుతమైనది బార్లీ నీరు. వీటిని తాగడం వల్ల మూత్రాశయ సమస్యలు దూరం చేస్తాయి. అంతేకాదు ఆరోగ్యాన్ని అందిస్తాయి. చర్మానికి చాలా మంచిది. రక్తపోటును నియంత్రించడంలో కూడా తోడ్పడతాయి. మరి తెలుసుకున్నారు కదా బార్లీ నీటితో ఎంత ఉపయోగమో..ఇన్ని ప్రయోజనాలు ఉన్న బార్లీ నీటిని తాగేసేయండి. మంచి ఆరోగ్యం మీ సొంతం చేసుకోండి.

## వాకింగ్ అవసరం లేకుండా ఈ 4 పనులు చేస్తే బరువు తగ్గుతారు



ఆరోగ్యానికి వ్యాయమం తప్పనిసరి. నేటి కాలంలో ప్రతి ఒక్కరూ బిజీగా ఉండడంతో ఆరోగ్యంపై అశ్రద్ధ వహిస్తున్నారు. దీంతో అనేక కొత్త రోగాలు వస్తున్నాయి. వివిధ రకాల ఆహార పదార్థాలు తినడం వల్ల బరువు పెరుగుతున్నారు. బరువు తగ్గించుకునేందుకు రోజూవారీ జీవితంలో శారీరక శ్రమ తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు. సాఫ్ట్ జాబ్స్ చేసేవాళ్లు బరువు తగ్గాలంటే రోజులో కనీసం కొన్ని నిమిషాలెఎనా వాకింగ్ చేస్తే ఆరోగ్యంగా ఉండగలుగుతారని అంటున్నారు. అయితే చాలా మందికి సమయం లేకపోండంతో వాకింగ్ చేయడం కుదరడం లేదు. వాకింగ్ చేయాలని ఉన్నా ఒక్కోసారి శరీరం సహకరించదు. ఈ నేపథ్యంలో వాకింగ్ కు ప్రత్యామ్నాయంగా ఇలా చేస్తే బరువు తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.స్కిప్పింగ్: చిన్నప్పుడు స్కూళ్లలో చదువుకునేటప్పుడు స్కిప్పింగ్ ను గేమ్ లో భాగంగా చేర్చేవారు. కానీ ఇప్పుడు ఇది ఆరోగ్యాన్ని కూడా పెంచుతుంది. ప్రతిరోజూ కొన్ని నిమిషాల పాటు స్కిప్పింగ్ చేయడం వల్ల శరీరంలోని బరువు తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. ఇది సింగిల్ గా కాకుండా సన్నిహితులతో కలిసి గేమ్ లగా ఏర్పాటు చేసుకొని స్కిప్పించ్ చేయడం వల్ల మరింత ఉత్సాహంగా ఉంటారంటున్నారు. స్కిప్పింగ్ చేయడం వల్ల కండరాల గట్టిపడుతాయి. చెమటకు బయటకు తీస్తుంది. దీంతో ఆరోగ్యంగా ఉండగలుగుతారు.ట్రెక్కింగ్: కొందరు ఖాళీ సమయం దొరికితే సినిమాలు, షికార్లకు వెళ్తుంటారు. ఈ సమయాన్ని ట్రెక్కింగ్ కు ఉపయోగిస్తే మనసు ఉల్లాసంగా ఉండడంతో పాటు ఆరోగ్యంగా ఉండగలుగుతారని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ట్రెక్కింగ్ చేయడం వల్ల గుండె పనితీరు మెరుగుపడుతుంది. ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది. ట్రెక్కింగే చేసే ప్రదేశాలు తక్కువే ఉంటాయి. అయితే తీరిక దొరకినప్పుడల్లా ట్రెక్కింగ్ ను ఎంచుకోవడం ఉత్తమం అనిఅంటున్నారు.మెట్లు ఎక్కడం: నేటి కాలంలో పెద్ద పెద్ భవనాలు నిర్మీతమవుతున్నాయి. దీంతో వాటిల్లో లిఫ్ట్ లు తప్పనిసరిగా ఉంటున్నాయి. చాల వరకు పై ఫ్లోర్ కు అర్జంట్ గా వెళ్లాలంటే లిఫ్ట్ ను వాడడంలో తప్పు లేదు. కానీ సమయం ఉన్నప్పుడు లిఫ్ట్ ను అవైడ్ చేసి మెట్ల మీద నుంచి వెళ్లేందుకు ప్రయత్నించాలి. ఇలా ప్రతి రోజూ కనీసం రెండు సార్లు అయినా మెట్ల ఎక్కడం వల్ల కాళ్ల కండరాలు గట్టిపడుతాయి. ఎక్కువ శాతం మెట్లు ఎక్కడం వల్ల బరువును అదుపులో ఉంచుతుంది.డ్యాన్స్: కొందరు చిన్నప్పుడు బాగా డ్యాన్స్ చేస్తారు. కానీ పెద్దయ్యాక సిగ్గుపడుతారు. కానీ ఇష్టమైన మ్యూజిక్ తో ప్రతిరోజూ డ్యాన్స్ చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని కొందరు వైద్య నిపుణులు చెబుతున్నారు. డ్యాన్స్ చేయడం వల్ల డిప్రెషన్ నుంచి బయటపడుతారు. ఒత్తిడిని తగ్గించి ప్రశాంతంగా ఉండేలా చేస్తుంది. అయితే ఇంట్లో ఎవరూ లేనప్పుడు బిగ్గరగా సౌండ్ వేసుకోవడం ద్వారా ఎక్కువ సేపు డ్యాన్స్ చేయగలుగుతారు.

## పీరియడ్స్ సమయంలో ఈ తప్పులు చేయకూడదు..



కొన్ని విషయాల పట్ల పెద్దలు చాలా జాగ్రత్తలు చెబుతుంటారు. కానీ మీకేం తెలుసే ముసలొల్లు అని కొట్టిపారేస్తారు ఈ కాలం జనరేషన్ అమ్మాయిలు. అయితే పీరియడ్స్ సమయంలో కూడా కొన్ని విషయాలను చెబుతారు.కానీ వింటేగా.. అయితే పీరియడ్స్ సమయంలో కడుపు నొప్పి, నడుము నొప్పి వంటివి ఇబ్బంది పెడతాయి. మానసికంగా కూడా ఈ సమయంలో కాస్త ఇబ్బందిగానే అనిపిస్తుంటుంది. కానీ తెలిసి తెలియక కొన్ని తప్పులు చేస్తుంటారు. మరీ ఈ పీరియడ్స్ సమయంలో చేయకూడని తప్పులు ఏంటో చూసేద్దామా?వాక్సింగ్.. పీరియడ్స్ సమయంలో వాక్సింగ్ చేయకూడదు. దీనివల్ల సున్నితత్వం, నొప్పి మరింత పెరుగుతుంది. రుతుస్రావం సమయంలో హార్మోన్ల హెచ్చుతగ్గులు స్కిన్ ను సున్నితంగా చేస్తాయి. వాక్సింగ్ సెషన్ లలో అసౌకర్యాన్ని పెంచుతాయి. అసౌకర్యం తగ్గడానికి పీరియడ్స్ కు ముందు, తర్వాత వ్యాక్సింగ్ చేయించుకోవడం మంచిది. నీరు తక్కువ తీసుకోవడం.. పీరియడ్స్ లో కలిగే ఇబ్బంది వల్ల చాలా మంది మహిళలు నీరు తాగడం మర్చిపోతుంటారు. యూరిన్ కు ఎక్కువ సార్లు వెళ్లాల్సి వస్తుందని మరింత భయపడతారు. కానీ ఈ సమయంలోనే మంచినీరు ఎక్కువ తీసుకోవాలి. హైడ్రేటెడ్ గా ఉంచడం చాలా ముఖ్యం. ఈ సమయంలో నీరు ఎక్కువగా తాగడం వల్ల కడుపు ఉబ్బరం, తిమ్మిరి, తలనొప్పి వంటి సమస్యలు రావు.పెయిన్ తగ్గించే మందులు.. పీరియడ్స్ లో నొప్పి ఎక్కువగా ఉంటుంది. కానీ దాన్ని తగ్గించుకోవడానికి టాబ్లెట్స్ మాత్రం వాడకూడదు అంటారు నిపుణులు. ఇవి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలను కలిగిస్తాయి. ఇబుప్రోఫెన్ వంటి నాన్ స్టెరాయిడ్ యాంటీ ఇన్ఫ్లమేటరీ డ్రగ్స్ మితిమీరిన వినియోగం వల్ల జీర్ణ సమస్యలు, ఇతర సమస్యలు వస్తాయట. మందుల మీద ఆధారపడకుండా రుతుక్రమ అసౌకర్యాన్ని తగ్గించే హీట్ థెరపీ సున్నితమైన వ్యాయామం వంటివి చేయాలి. నిద్ర.. పీరియడ్స్ సమయంలో మంచి నిద్ర చాలా అవసరం. కానీ కొందరు పెయిన్ వల్ల, బ్లీడిరగ్ వల్ల ఎక్కువగా నిద్రకు దూరం అవుతుంటారు. దీనివల్ల హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటుంది. పీరియడ్స్ పెయిన్ మరింత పెరుగుతుంది. అలసట, తిమ్మిర్లు, మూడ్ స్వింగ్స్ వంటి సమస్యలు వస్తాయి. ఈ సమయంలో 8 నుంచి 9 గంటలు నిద్ర పోవాల్సిందే. షుగర్ ఫుడ్స్, కెఫిన్.. ఈ సమయంలో కాఫీలు, షుగర్ ఫుడ్స్ తినకూడదు. పీరియడ్స్ సమయంలో ఈ పదార్థాలు తినాలి అనిపిస్తుంది కానీ మితంగా తినాలి. హెర్బల్ టీలు, డార్క్ చాక్లెట్, ఆరోగ్యకరమైన పండ్లతో కోరికలు తీర్చుకుంటే సరిపోతుంది అంటున్నారు నిపుణులు.

## తాటి ముంజలకూ కష్టకాలం..



ప్రకృతి మనకు ఎంతో చేస్తోంది. ఎన్నో ఆరోగ్యవంతమైన చెట్లు, పండ్లు, ఆకులను ఇస్తుంది. అయితే వాటిని గుర్తించడంలోనే మనిషి విఫలమవుతున్నాడు. అందుబాటులో ఉన్నవానిని సద్వినియోగం చేసుకోలేక.. ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చిన వేల రూపాయలు ఆస్పత్రికి ఖర్చు పెడుతున్నారు. ఉచితంగా, సహజంగా అందే వాటిని దూరం పెడుతన్నారు. అయితే వైద్యులు కూడా సీజనల్ ఫ్రూట్స్ తీసుకోవాలని సూచిస్తుంటారు. కానీ, వాటిని పెద్దగా పట్టించుకోకుండా జంక్ ఫుడ్‌కు అలవాటు పడుతున్నారు. వయసుతో సంబంధం లేకుండా అందరూ రెడీమేడ్ ఫుడ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. తాటి ముంజలు దొరకవా.. ఇక ప్రస్తుతం తాటి ముంజల సీజన్. పది ఇరవై ఏళ్ల క్రితం వరకు తాటి ముంజలు మార్కెట్‌లో విరివిగా లభించేవి. ఇక ఊళ్లకు వెళితే.. గౌడన్నలు ఫ్రీగా కోసి ఇచ్చేవారు. చెట్టు మీది తాటి ముంజలు తింటే వచ్చే టేస్టే వేరు. కానీ, ప్రస్తుత పరిస్థితి చూస్తే తాటి ముంజలు కూడా రానురాను దొరకవేమో అనిపిస్తోంది. కోసేవారు లేక.. గ్రామాల్లో గీత కార్మికులు తగ్గిపోతున్నారు. గౌడ కుటుంబాలు ఉన్నా తాటి చెట్లు ఎక్కేవారు తగ్గిపోతున్నారు. ఒకప్పుడు ఊళ్లో ప్రతీ గౌడ కుటుంబంలో ఒకరిద్దరు గీత కార్మికులు ఉండేవారు. ఇప్పుడు ఊరికి కూడా ఇద్దరు ముగ్గురు మించి ఉండడం లేదు. దీంతో కల్లు గీసేవారు, తాటి ముంజలు కోసేవారు తగ్గిపోతున్నారు. సీజనల్‌గా తాటి ముంజలు అమ్మేవారు ఇబ్బంది పడుతన్నారు.పెరుగుతున్న ధర.. తాటి ముంజలు కోసేవారు తగ్గిపోవడంతో తాటి ముంజల ధర కూడా పెరుగుతోంది. ఊళ్లో ఉండే ఇద్దరు ముగ్గురు గీత కార్మికులు తాటి చెట్టు ఎక్కి ముంజలు కోసి ఇవ్వడానికి డబ్బులు తీసుకుంటున్నారు. ఒకప్పటిలా ఫ్రీగా కోసి ఇవ్వడం లేదు. దీంతో వాటిని మార్కెట్‌కు, ఊళ్లకు తీసుకువచ్చి అమ్మేవారు ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. ఒకప్పుడు రూపాయి, రెండు రూపాయలు ఉన్న ముంజలు ఇప్పుడు పది రూపాయలకుపైగా పలుకుతోంది. ముంజలు తీయడం ఇబ్బందే.. ఇక గీత కార్మికులు తాటికాయలు మాత్రమే కోసి ఇస్తున్నారు. ముంజలు తీయడం లేదు. దీంతో వాటిని అమ్మేవారే అమ్మే స్థలంలోనే కోసి ఇస్తున్నారు. గీత కార్మికులు నేర్పరితో కోయడం వలస సులభంగా ముంజలు తీస్తారు. కానీ మహిళలు ఒక కాయ కోడానికి ఐదు నిమిషాలు పడుతుంది. దీంతో కొనేవారు వేచి ఉండలేక వెళ్లిపోతున్నారు. నాణ్యత కూడా దెబ్బతింటోంది.

# టీమిండియాకు బిగ్ షాక్..




**ముంబై** స్వదేశంలో వచ్చే నెల 8వ తేదీ నుంచి జరగనున్న పొట్టి ప్రపంచకప్‌కు ముందే డిఫెండింగ్ ఛాంపియన్ టీమిండియాకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే యువ బ్యాటర్ తిలక్ వర్మ శస్త్రచికిత్స కారణంగా టోర్నీలో పాల్గొనడంపై అనిశ్చితి నెలకొనగా.. తాజాగా ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ సన్నాహక సిరీస్‌కు దూరమయ్యాడు. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో గాయపడిన సుందర్ పూర్తిగా కోలుకోవడానికి మరికొంత సమయం పట్టే అవకాశముందని జట్టు వర్గాలు తెలిపాయి. దీంతో తదుపరి టీ20 సిరీస్‌లో అతడు అందుబాటులో ఉండడం లేదని స్పష్టం చేశారు.వడోదర వేదికగా జరిగిన తొలి వన్డేలో ఐదు ఓవర్లు బౌలింగ్ చేసిన సుందర్ పక్కటెముకల నొప్పితో మైదానం వీడాల్సి వచ్చింది. అతడి స్థానంలో సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్‌గా ధ్రువ్ జురెల్ మైదానంలోకి వచ్చాడు. బ్యాటింగ్ చేయడం కూడా కష్టమే అనుకున్న సమయంలో సుందర్ ధైర్యంగా క్రీజులోకి వచ్చి కేఎల్ రాహుల్‌తో కలిసి చివరి వరకు నిలబడ్డాడు. అయినప్పటికీ గాయం తీవ్రత ఎక్కువగా ఉండటంతో కోలుకునేందుకు సమయం అవసరమని వైద్యులు సూచించారు. ఈ నేపథ్యంలో చివరి రెండు వన్డేల కోసం హేమంగ్ బదోని జట్టులోకి ఎంపికయ్యాడు. టీ20 సిరీస్ నాటికి సుందర్ ఫిట్ అవుతాడని ఆశించిన భారత బృందానికి ఇది పెద్ద షాక్‌గా మారింది. టీ20ల్లో నిలకడగా రాణిస్తున్న సుందర్ గాయం జట్టు సమతుల్యాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఇప్పటివరకు 16 మ్యాచ్‌ల్లో 23 వికెట్లు తీసి 6.16 ఎకానమీతో ఆకట్టుకున్నాడు. బ్యాట్‌తో కూడా కీలక సమయంలో పరుగులు చేసి జట్టుకు బలంగా నిలిచాడు. అందుకే అతడు త్వరగా కోలుకోవాలని మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. ప్రపంచకప్ స్క్వాడ్‌లో మార్పులు చేసుకునేందుకు జనవరి 31వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉండటంతో, ఆలోపు సుందర్ ఫిట్ అయితేనే తుది జట్టులో చోటు దక్కే పరిస్థితి నెలకొంది. అభిమానులు మాత్రం అతడు త్వరగా కోలుకుని మళ్లీ మైదానంలో మెరవాలని ప్రార్థిస్తున్నారు.

# సిరాజ్‌కు సారథ్య ముద్ర..



**హైదరాబాద్** భారత జట్టు పేస్ బౌలర్ మహ్మద్ సిరాజ్‌కు కీలక బాధ్యతలు అప్పగిస్తూ హైదరాబాద్ క్రికెట్ సంఘం సంచలన నిర్ణయం తీసుకుంది. 2025-26 రంజీ సీజన్‌లో రాబోయే రెండు మ్యాచ్‌లకు హైదరాబాద్ జట్టు సారథిగా సిరాజ్‌ను నియమించారు. అంతర్జాతీయ స్థాయిలో అపార అనుభవం కలిగిన సిరాజ్ నాయకత్వంలో జట్టు బరిలోకి దిగనుండటంతో అభిమానుల్లో భారీ ఉత్సాహం నెలకొంది. ఇప్పటివరకు జట్టును నడిపించిన రాహుల్ సింగ్ స్థానంలో సిరాజ్ బాధ్యతలు చేపట్టనున్నాడు. రాహుల్ సింగ్ ఇకపై ఉపసారథిగా వ్యవహరిస్తాడు. ఒత్తిడిలోనూ చల్లని మనసుతో నిర్ణయాలు తీసుకునే సిరాజ్ సామర్థ్యం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్ జట్టు గ్రూప్ డీలో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. నాకౌట్ దశకు చేరుకోవాలంటే రాబోయే మ్యాచ్‌లు అత్యంత కీలకం కానున్నాయి.జనవరి 22న ముంబైతో, జనవరి 29న ఛత్తీస్‌గఢ్‌తో హైదరాబాద్ జట్టు కీలక పోరులు ఆడనుంది. ఈ రెండు మ్యాచ్‌ల్లో సిరాజ్ జట్టును ముందుండి నడిపించనున్నాడు. బౌలింగ్‌లో దూకుడుతో పాటు సారథిగా సరైన వ్యూహాలు అమలు చేస్తే హైదరాబాద్ జట్టు తిరిగి విజయపథంలోకి వస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.హైదరాబాద్ జట్టు సభ్యులు మహ్మద్ సిరాజ్, రాహుల్ సింగ్, మిలింద్, తనయ్, రోహిత్ రాయుడు, హిమతేజ, వరుణ్ గౌడ్, అభిరథ్ రెడ్డి, రాహుల్ రాధేష్, అమన్ రావు, రక్షణ్ రెడ్డి, నితిన్ యాదవ్, నితీష్ రెడ్డి, ప్రజ్ఞయ్, పున్నయ్యగా ఎంపికయ్యారు. ప్రత్యామ్నాయ జాబితాలో మికిల్, అవినాష్ రావు, కార్తికేయ, ప్రణవ్, పి నితీష్ రెడ్డి ఉన్నారు.సిరాజ్‌కు దక్కిన ఈ బాధ్యత హైదరాబాద్ క్రికెట్‌కు కొత్త ఉత్సాహం నింపుతుందని క్రీడాభిమానులు విశ్వసిస్తున్నారు.

# 11 ఏళ్ల రికార్డు బద్దలు రాహుల్ చరిత్ర..!



**ముంబై** భారత్ న్యూజిలాండ్ మధ్య జరిగిన కీలక మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ అరుదైన ఘనత సాధించి క్రికెట్ చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించాడు. గత 11 ఏళ్లుగా ఎవరికీ సాధ్యం కాని రికార్డును రాహుల్ బద్దలు కొట్టడంతో అభిమానులు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. కీలక సమయంలో బాధ్యతాయుతమైన బ్యాటింగ్ చేసి జట్టును గెలుపు దిశగా నడిపించే ప్రయత్నం చేశాడు. అతడి ఇన్నింగ్స్‌లో సహనం, సమతుల్యత, ధైర్యం స్పష్టంగా కనిపించాయి. ముఖ్యంగా ఒత్తిడిలోనూ క్రీజ్‌లో నిలబడుతూ పరుగులు రాబట్టిన తీరు విశ్లేషకుల ప్రశంసలు పొందింది. ఈ ప్రదర్శనతో రాహుల్ మరోసారి తన స్థాయిని నిరూపించుకున్నాడు.అయితే మ్యాచ్ అనంతరం కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఓటమిపై స్పందించాడు. మ్యాచ్‌లో జరిగిన ఒక కీలక తప్పిదమే జట్టు పరాజయానికి ప్రధాన కారణమైందని ఆయన వెల్లడించాడు. ఫీల్డింగ్ సమయంలో వచ్చిన చిన్న నిర్లక్ష్యం ప్రత్యర్థికి భారీ ఆధిక్యం అందించిందని, అదే చివరకు ఫలితాన్ని ప్రభావితం చేసిందని పేర్కొన్నాడు. ఆటగాళ్లు మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిందిగా సూచించాడు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకొని తదుపరి మ్యాచ్‌ల్లో మెరుగైన ప్రదర్శన చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతామని గిల్ ధీమా వ్యక్తం చేశాడు.రాహుల్ రికార్డు ఇన్నింగ్స్ ఒకవైపు అభిమానులను ఉత్సాహపరిచినా, మరోవైపు ఓటమి జట్టుకు హెచ్చరికగా మారింది. రాబోయే మ్యాచ్‌ల్లో ఈ అనుభవాన్ని ఉపయోగించుకొని జట్టు మరింత సమిష్టిగా ఆడితే విజయాలు తప్పవని క్రీడా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# బోర్డు డైరెక్టర్ మాటలతో మండిపడ్డ ప్లేయర్లు..




**ముంబై** బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు మరియు ఆటగాళ్ల మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి. బోర్డు ఫైనాన్స్ కమిటీ చైర్మన్ నజ్ముల్ ఇస్లాం చేసిన వ్యాఖ్యలు దేశ క్రికెటర్లను ఆగ్రహానికి గురిచేశాయి. ఆయన తక్షణమే రాజీనామా చేయాలని క్రికెటర్ల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. రాజీనామా చేయకపోతే ఈ నెల 15న జరిగే ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌ల నుంచి అన్ని క్రికెట్ కార్యక్రమాలను బహిష్కరిస్తామని ఆటగాళ్లు స్పష్టం చేశారు.ఇటీవల ముస్తాఫిజుర్ రెహమాన్‌ను ఐపీఎల్ నుంచి తప్పించడం, ప్రపంచకప్ కోసం భారత్‌కు వెళ్లడంపై నెలకొన్న వివాదాల నేపథ్యంలో మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ భావోద్వేగాలకు లోనుకాకుండా చర్చల ద్వారా సమస్య పరిష్కారం కావాలని సూచించాడు. దీనిపై నజ్ముల్ ఇస్లాం సోషల్ మీడియా వేదికగా తమీమ్‌ను అవమానకరంగా సంబోధించడం పెద్ద దుమారం రేపింది. ఈ వ్యాఖ్యలు ఆటగాళ్ల గౌరవాన్ని దెబ్బతీశాయని సంక్షేమ సంఘం మండిపడింది.ఈ పరిస్థితి తీవ్రతను గ్రహించిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధికారికంగా స్పందించింది. నజ్ముల్ వ్యాఖ్యలు బాధాకరంగా అనిపించి ఉంటే క్షమాపణలు కోరుతున్నామని బోర్డు ప్రకటించింది. అవి బోర్డు అభిప్రాయాలు కావని స్పష్టం చేసింది. ఆటగాళ్లను అవమానించే ప్రవర్తనపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపింది. దేశ క్రికెట్‌కు ఆటగాళ్లే అసలైన బలం అని బోర్డు పేర్కొంది.అయితే ఆటగాళ్ల ఆగ్రహం ఇంకా చల్లారకపోవడంతో రాబోయే రోజుల్లో ఈ వివాదం ఏ మలుపు తిరుగుతుందోనని క్రీడా వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

## అన్నపూర్ణ స్టూడియోస్ 50 ఏళ్ల సంబరం..




**హైదరాబాద్** హైదరాబాద్‌లోని ప్రముఖ సినీ నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్ స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అక్కినేని కుటుంబం సంక్రాంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించింది. 1976లో లెజెండరీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు సంక్రాంతి పండుగ రోజున ఈ స్టూడియోను ప్రారంభించారు. నాన్నగారి దార్శనికతకు నిదర్శనంగా నిలిచిన ఈ గోల్డెన్ జూబ్లీ మైలురాయిని చేరుకోవడం పట్ల అక్కినేని నాగార్జున భావోద్వేగంతో కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఏడాది వేడుకలకు కొత్త జంట నాగచైతన్య, శోభిత ధూళిపాళ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సంప్రదాయ వస్త్రధారణలో స్టూడియో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి పండుగను ఆనందంగా జరుపుకున్నారు. ఏఎన్నార్ కాలం నుంచి కొనసాగుతున్న సంప్రదాయాన్ని పాటిస్తూ అక్కినేని కుటుంబ సభ్యులు స్వయంగా సిబ్బందికి పండుగ విందు వడ్డించి అందరి మనసులు గెలుచుకున్నారు. స్టూడియో ప్రాంగణమంతా పూలతో, దీపాలతో కళకళలాడింది. ఈ వేడుకల్లో అమల, అఖిల్, సుమంత్ సహా కుటుంబ సభ్యులంతా పాల్గొన్నారు. 50 ఏళ్లుగా వేలాది మందికి ఉపాధి కల్పిస్తూ తెలుగు చిత్ర పరిశ్రమను హైదరాబాద్ కేంద్రంగా తీర్చిదిద్దడంలో అన్నపూర్ణ స్టూడియో కీలక పాత్ర పోషించిన విషయాన్ని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అభిమానులు ఈ సంబరాల దృశ్యాలను సోషల్ మీడియాలో విస్తృతంగా పంచుకుంటూ అక్కినేని కుటుంబంపై ప్రేమను చాటుతున్నారు.

## తలైవా సినిమాలో మక్కల్ సెల్వన్ హంగామా..



**హైదరాబాద్** సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం జైలర్ 2 నుంచి అభిమానులకు సూపర్ అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రంలో మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి నటిస్తున్నారన్న వార్తలను ఆయనే స్వయంగా ధృవీకరించారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తాను ఈ సినిమాలో కీలక అతిథి పాత్రలో కనిపించబోతున్నానని వెల్లడించారు. రజనీకాంత్‌తో కలిసి పనిచేయడం తనకు గర్వకారణమని తెలిపారు. ఆయన అనుభవం నుంచి ఎంతో నేర్చుకోవచ్చని, అదే ఉద్దేశంతో ఈ పాత్రను అంగీకరించానని చెప్పారు. గతంలో ఇద్దరూ పెట్టా సినిమాలో కలిసి నటించిన విషయం తెలిసిందే. జైలర్ 2లో విజయ్ సేతుపతి పవర్‌ఫుల్ పోలీస్ అధికారిగా కనిపించనున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ పాత్ర కథకు కీలక మలుపు తీసుకువచ్చే విధంగా ఉంటుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంలో శివరాజ్ కుమార్, మోహన్ లాల్, ఎస్ జే సూర్య, మిథున్ చక్రవర్తి వంటి దిగ్గజ నటులు కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు సమాచారం. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండటంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ముత్తువేల్ పాండియన్ పాత్రలో రజనీకాంత్ మరోసారి తన స్టైల్, స్వాగ్‌తో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమాను 2026 6 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే సోషల్ మీడియాలో ఈ సినిమా పై భారీ హైప్ నెలకొనగా, విజయ్ సేతుపతి ఎంట్రీతో క్రేజ్ మరింత పెరిగింది. అభిమానులు ఈ కాంబినేషన్‌ను వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

## యాక్షన్ మోడ్‌లోకి గ్లోబల్ బ్యూటీ..




**ముంబై** గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా జోనాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ది బ్లఫ్ ట్రైలర్ విడుదలై ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తోంది. ఈ ట్రైలర్‌లో ప్రియాంక గతంలో ఎన్నడూ చూడని విధంగా శక్తివంతమైన సముద్రపు దొంగ పాత్రలో కనిపించి అభిమానులను ఆశ్చర్యపరిచింది. ఉగ్ర యాక్షన్ సన్నివేశాలు, కత్తి యుద్ధాలు, భావోద్వేగ క్షణాలతో ట్రైలర్ ఆద్యంతం ఉత్కంఠగా సాగుతోంది. కథ పదొమ్మిదవ శతాబ్దపు కరీబియన్ దీవుల నేపథ్యాన్ని ఆధారంగా తీసుకుంది. ఒకప్పుడు హింసాత్మక జీవితం గడిపిన సముద్రపు దొంగ కుటుంబంతో ప్రశాంతంగా జీవించాలనుకుంటుంది. కానీ గత శత్రువు మళ్లీ ఎదురవడంతో కుటుంబాన్ని కాపాడుకునేందుకు మళ్లీ ఆయుధం పట్టాల్సిన పరిస్థితి వస్తుంది. తన ప్రేమించిన వారిని రక్షించేందుకు ఆమె చేసే పోరాటమే కథగా చూపించారు. ట్రైలర్‌లో ప్రియాంక చేసిన శక్తివంతమైన యాక్షన్ విన్యాసాలు ప్రేక్షకులను కట్టిపడేస్తున్నాయి. భావోద్వేగ సన్నివేశాల్లోనూ ఆమె నటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాతలు నిర్మించగా, దర్శకుడు ఈ కథను విజువల్ విందుగా తీర్చిదిద్దాడు. ఈ సినిమా ఫిబ్రవరి 25 నుంచి ప్రముఖ ఓటీటీ వేదికలో నేరుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదిలా ఉండగా ప్రియాంక ప్రస్తుతం ప్రముఖ దర్శకుడు తెరకెక్కిస్తున్న భారీ భారతీయ చిత్రంలో కూడా కీలక పాత్రలో నటిస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో తన సత్తాను చాటుకుంటూ మరోసారి యాక్షన్ రూపంలో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్న ప్రియాంకపై సినీ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

## సాయి పల్లవి బాలీవుడ్ ఎంట్రీ..!




**హైదరాబాద్** టాలీవుడ్‌లో నేచురల్ బ్యూటీగా గుర్తింపు పొందిన సాయి పల్లవి ఇప్పుడు హిందీ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమైంది. అమీర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న భారీ ప్రేమకథా చిత్రమైన ఏక్ దిన్ ఫస్ట్ లుక్‌ను సంక్రాంతి సందర్భంగా చిత్రబృందం విడుదల చేసింది. జపాన్‌లో మంచు కురిసే అందమైన ప్రదేశాల్లో చిత్రీకరించిన ఈ పోస్టర్‌లో సాయి పల్లవి, జునైద్ ఖాన్ మధ్య కనిపిస్తున్న అనుబంధం ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేపుతోంది. ఇద్దరి కెమిస్ట్రీ సినిమాపై అంచనాలను ఆకాశానికి చేర్చింది. సునీల్ పాండే దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని అమీర్ ఖాన్ ప్రొడక్షన్స్ పతాకంపై అమీర్ ఖాన్, మన్సూర్ ఖాన్, అపర్ణ పురోహిత్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. దాదాపు 17 సంవత్సరాల విరామం తర్వాత అమీర్ ఖాన్, మన్సూర్ ఖాన్ మళ్లీ కలిసి పని చేయడం విశేషంగా మారింది. ఇద్దరు అపరిచితుల జీవితాల్లో ఒకే రోజులో చోటు చేసుకునే భావోద్వేగ మార్పుల చుట్టూ ఈ కథ తిరుగుతుందని సమాచారం. ఈ చిత్రానికి రామ్ సంపత్ సంగీతం అందిస్తుండగా, ఇర్షాద్ కామిల్ సాహిత్యాన్ని అందిస్తున్నారు. మనోజ్ లోబో ఛాయాగ్రహణం, బల్లు సలూజా ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే సాయి పల్లవి రణబీర్ కపూర్ సరసన రామాయణం చిత్రంలో సీత పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఆ సినిమా కంటే ముందే ఏక్ దిన్ ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఫస్ట్ లుక్ విడుదలతోనే ఈ సినిమా సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. అభిమానులు సాయి పల్లవి కొత్త ప్రయాణానికి శుభాకాంక్షలు వెల్లువెత్తిస్తున్నారు.

Edited, Published & Owned by **BHUPATHI SANTHOSH.** Printed at PARAHUSHAR PRINTING PUBLICATIONS, H. NO. 1-6-27/2,SRI NAGAR COLONY, MAHABUBABAD, WARANGAL, TELANGANA-506101.Published at Jammikunta, karimnagar,Telangana-505122. EDITOR: BHUPATHI SANTHOSH. Cell: 9247819181 | **RNI No: TGTEL/25/A1882,**Email:Mana vaartha tg. Daily@gmail.com